డిసెంబర్ 2015

క్రిస్టమస్ పండుగ శుభాకాంక్షలతో

కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ మాసపత్రిక   వెల రూ.25/-





సంపుటి: 1 సంచిక: 7 | పుటలు: 68 | విడి ప్రతి వెల: 25 | డిసెంబరు 2015

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702877670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhra Pradesh
Phone: 08662579129

RNI Registration No: APTEL/2014/62705
Postal Registration No: HDP/008/2015-17

సంపాదకులు: నారాయణ శర్మ

గౌరవ సలహాదారు: యు. సుబ్బరాజు

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

యాజమాన్యం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

అడవి రాముడు : 9491870753

వీరాంజనేయులు : 7799260684

ఫైనార్ట్స్ చదువుతున్న ఇతర మిత్రులు కూడా.

వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

కె. మల్లికార్జున: 9000453887



విషయ సూచిక

ముందుమాట

పిల్లలు రాసిన కథలు

పెద్దలు రాసిన కథలు

అనువాద కథలు

అవీ-ఇవీ



ముఖచిత్రం: చిన్నారి ఏసు

చిత్రకారుడు: శివరాం ప్రసాద్

80



క్రిస్మస్ భూతాలు

అనగనగా ఒక వేటగాడు ఉండేవాడు. అతనికి ఒకసారి ధృవపు ఎలుగుబంటి పిల్ల ఒకటి దొరికింది. నిండా దట్టంగా ఊలుతో, అమాయకంగా ముద్దు గొలుపుతూ ఉండిందది. ఒక్క మచ్చలేకుండా మంచులాగా మెరిసిపోతున్న ఆ చిట్టి పిల్లని చూసేసరికి వేటగాడికి ముచ్చట వేసింది. అతను దానిని చాలా ఇష్టంగా పెంచుకోసాగాడు.

సొంత బిడ్డలాగా పెంచుతూ, దానిని రకరకాల విన్యాసాలు వగైరాలు నేర్పాడు. అది రెండు కాళ్ల మీద నడిచేది, ఒంటి కాళ్ల మీద డాన్సు చేసేది, ఎవరైనా మెచ్చుకుంటే వంగి అభివాదం కూడా చేసేది!

కొన్నేళ్లకు అది బాగా పెద్దదైంది. అది ఎంత సాధువంటే, ఇప్పుడు అది వేటగాడిని తన వీపు మీద ఎక్కించుకొని మంచు కొండల మీదంతా త్రిప్పేది!!

ఒకరోజున దాన్ని చూసి వేటగాడు అనుకున్నాడు- "ఇప్పుడు ఇది చాలా పెద్దదైంది. నా దగ్గర ఉండేకంటే డెన్మార్క్ దేశపు రాజు గారి దగ్గర ఉంటే దీనికి మర్యాద, మన్నన. బహుశా ఆయన

నాకు తిరిగి ఇంకా గొప్ప బహుమానం కూడా ఇవ్వచ్చు!" అని.

ఆ సంవత్సరం నవంబరు నెలలో బయలుదేరి అతను నార్వే మీదుగా డెన్మార్కుకు ప్రయాణం కట్టాడు. మంచు కొండల్లోంచి వేగంగా వీచే ఈదురు గాలులు, చెలరేగే మంచు తుఫానులు అతని ప్రయాణాన్ని ఘోరంగా అడ్డుకున్నాయి. దాంతో క్రిస్మస్ నాటికి అతను ఇంకా డోవర్‌ఫెల్‌లోనే ఉన్నాడు! (మధ్య నార్వేలోని ఒక కొండ ప్రాంతం అది!)

ఆరోజు చీకటి అయింది. వాతావరణం అయితే ఇంకా చాలా చల్లగా ఉంది. వేటగాడికి ఆ రాత్రి ఎక్కడ గడపాలో కూడా అర్థం కాలేదు. అంతలో కొంచెం దూరంగా పొదలమాటున ఒక కుటీరం కనిపించింది.

వేటగాడు ఆ ఇంటి దగ్గరకు వెళ్లి తలుపు తట్టి మర్యాదగా "నేను, నా చక్కని ఈ ఎలుగుబంటి- ఇద్దరమూ కోపెన్‌హాగన్‌కు పోతున్నాం. డెన్మార్క్ రాజుగారికి ఈ ఎలుగుబంటిని బహుమతిగా ఇవ్వాలని నా ఉద్దేశ్యం. అయితే దారిలో ఇక్కడే చీకటి అయింది. ఈ క్రిస్మస్ రాత్రిని మీ ఇంట్లో గడిపేందుకు ఏదో ఒక మూలన మాకు ఇంత చోటు ఇచ్చారంటే, మీ పుణ్యాన్ని మరచిపోను" అన్నాడు.

తలుపు తీసిన ఇంటి యజమాని పేరు హాల్వర్. అతనన్నాడు "బాబూ! నేను చెప్తున్నది నిజం అని ఆ పైవాడికి ఒక్కడికే ఎరుక- కానీ సంగతేమంటే, మేం బయటి వాళ్లనెవ్వరినీ, ఈ రోజు రాత్రికి మటుకు- ఇక్కడ ఉండనిచ్చే అవకాశం లేదు. ఎందుకంటే, ప్రతి క్రిస్మస్ నాటి రాత్రీ మా ఇంటికి ఒక భూతాల గుంపు వస్తూ ఉంటుంది. వాటికి బెదురుకొని ఈ రాత్రంతా మేం-ఇంటి వాళ్లమే, ఓ గదిలో దూరి, వణుక్కుంటూ కాలక్షేపం చేస్తుంటాం; ఇక మీకు చోటు ఎక్కడ ఇవ్వగలం? అందునా అతిథులను అట్లాంటి భయంకరమైన అనుభవాలకు గురిచేయటం మాకు ఏం బాగుంటుంది చెప్పు?" అన్నాడు.

"అంతేనా?!" అన్నాడు వేటగాడు తేలికగా. "మాకు భూతాలు అంటే ఏం భయం లేదు. నా ఈ పెంపుడు ఎలుగును కుంపటి క్రింద ముడుచుకొని పడుకోనివ్వండి. నేను ఆ ప్రక్క గదిలో

పడుకుంటాను. మీరెవ్వరూ మా గురించి చింత పడకండి. మమ్మల్ని మర్చిపోండి!" అన్నాడు. "సరే నీ ఇష్టం!" అన్నాడు ఇంటి యజమాని, వాళ్ళని లోనికి రానిస్తూ. "కానీ నేను ముందుగా చెప్పలేదు" అని మాత్రం అనకు. భూతాలు నిన్ను ఏం చేసినా నీదే బాధ్యత సుమా!"



వేటగాడు, ఎలుగుబంటి లోపలికి వెళ్లే సరికే ఇంట్లో వాళ్లు ఓ పెద్ద క్రిస్మస్ విందును తయారుచేసి టేబుల్ మీద పెట్టి ఉన్నారు. ఉడకబెట్టిన చేపలు, క్యాబేజ్ ఊరగాయ, ధృవపు

జింక మాంసం, క్రిస్మస్‌కు ప్రత్యేకంగా చేసే పాయసం- అన్నీ అందంగా పెట్టి ఉన్నాయి.

"ఇవన్నీ ఇదిగో, మాకు దాపురించబోయే భూతాల కోసమే! ఇక మీరెవరో మాకు తెలీదు! మీ క్షేమం మీరు చూసుకోవాలంతే!" అని ఇంట్లో వాళ్లు అందరూ ఓ మూల గదిలోకి పోయి తలుపులు మూసేసుకున్నారు.

కొంచెం సేపు అటూ ఇటూ తిరిగి చూసుకొని వేటగాడు-ఎలుగుబంటి కూడా కొద్దిగా కునుకుతీశారు.

అర్ధ రాత్రి కావస్తుండగా అనుకున్నట్లే భూతాల గుంపు ఒకటి వచ్చి పడింది!

ఆ భూతాలు ఎట్లా ఉన్నాయో ఏమని వర్ణించాలి!? కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి, కొన్నింటికి పొడవాటి తోకలున్నాయి, కొన్నింటికి అయితే అసలు తోకలే లేవు. కొన్నింటికి చాలా చాలా పొడవైన ముక్కులున్నాయి. కాని వాటికి వేటికీ ఏ కొంచెం కూడా మర్యాదలు లేవు. అవన్నీ ఇష్టం వచ్చినట్లు తిన్నాయి; త్రాగాయి; పాటలు పాడాయి; డాన్సులు చేశాయి; అటూ ఇటూ దూకాయి; పదార్థాలన్నింటినీ తన్ని తగలేశాయి; గ్లాసులు పగలగొట్టాయి, గది అంతటా వీరంగం చేశాయి!

అట్లా చాలా సేపు జరిగాక పిల్ల దయ్యం ఒకటి కుంపటి క్రిందికి వంగి చూసింది. చిన్న మాంసపు ముక్కను ఒకదాన్ని గుచ్చి పట్టుకొని, అక్కడ ప్రశాంతంగా నిద్రపోతున్న ఎలుగుబంటి ముక్కులోకి గ్రుచ్చుతూ "ఏయ్ పిల్లీ! పిల్లీ! ఇదిగో నీకో మాంసపు ముక్క" అని పాడటం మొదలుపెట్టింది.

ఎలుగుబంటి ఏం చేసినా భరిస్తుంది కానీ, నిద్ర లేపితే మాత్రం అది అస్సలు ఊరుకోదు. పిల్లదయ్యం చేష్టలకు ఉలిక్కిపడి నిద్ర లేచిన ధృవపు ఎలుగుబంటి తటాలున దాని మెడను ఒడిసి పట్టుకొని, భయంకరంగా గర్జిస్తూ లేచి నిలబడ్డది! అంతెత్తున లేచి అది ఒళ్లు విరుచుకుంటే, దాని చేతిలోని పిల్లభూతం కీచు కీచు మని మొత్తుకుంటే, వణికి పోయిన భూతాలన్నీ చెల్లా చెదురుగా, కనబడ్డ దారి గుండా భయటికి పరుగెత్తాయి!



మర్నాటి రోజున తలుపు తీసిన హాల్వర్‌కు, అతని కుటుంబ సభ్యులకు ఏం జరిగిందో చెప్పి, నవ్వుతూ సెలవు పుచ్చుకున్నారు వేటగాడు-ఎలుగుబంటి.

ఆ తర్వాతి సంవత్సరం క్రిస్మస్ రోజు- మధ్యాహ్నం సమయంలో- ఇంటి యజమాని పొయ్యిలోకి కట్టెలు ఏరుకుంటూ ఉన్నాడు. అప్పటికే ఇంట్లో వాళ్లు వంటలు కూడా మొదలు పెట్టి ఉన్నారు- ప్రతిసారి లాగే ఈసారీ రాబోయే భూతాలకోసం.

అంతలో అతని వెనక ఉన్న చెట్లలోంచి గుసగుసగా ఓ గొంతు వినిపించింది: "హాల్వర్!

హాల్వర్!" అని.

అతను వెనక్కి తిరిగి చూస్తే అక్కడ ఉన్నది ఒక కుర్ర భూతం!

"హాల్వర్! నీ ఆ పెద్ద పిల్లి- అది ఇంకా నీ దగ్గరే ఉందా?" అడిగింది ఆ భూతం, భయం భయంగా, కొద్దిగా వణుకుతున్న గొంతుతో.

"ఓ ఉన్నది! అదెక్కడికి పోతుంది?" అన్నాడు హాల్వర్ చిరునవ్వుతో. "అది ఇంకా కుంపటి క్రిందే పడుకొని ఉంది. ఈ ఏడాది దానికి ఇంకో ఏడు పిల్లలు పుట్టాయి; అవన్నీ దానికంటే పెద్దగా అయ్యాయి; దాని కంటే తిక్కగానూ, కోపంగానూ ప్రవర్తిస్తున్నాయి. అయినా మీరు రాత్రి భోజనానికి వస్తారుగా, అవన్నీ మీకు పరిచయం అవుతాయిలేండి.."

"-అయ్యో, అది చెప్పేందుకే వచ్చాను- విను! " అన్నది భూతం- "ఇక మీద మేం క్రిస్మస్‌కి మీ ఇంటికి రాలేము- మమ్మల్ని క్షమించు. ఏమీ అనుకోకు; ఇది చెప్పేందుకే వచ్చాను నేను!" అని ఆ భూతం చటుక్కున మాయమైపోయింది!

అది విన్నాక హాల్వర్, అతని కుటుంబ సభ్యులు అందరూ సంతోషంతో చిందులు వేశారు- ఎందుకంటే వాళ్లకు ఏనాడూ ఇంత మంచి క్రిస్మస్ బహుమతి దొరకలేదు మరి!

ఈ కథని ఇట్లా చెప్పేందుకు అనుమతించిన స్టోరీనోరీ డాట్ కాం వారికి, కథ చదివిన మీకు- అందరికీ లెక్కలేనన్ని క్రిస్మస్ శుభాకాంక్షలు!


కొత్తపల్లి బృందం



నవ్వుల రహస్యం!

పొరుగమ్మ: మీ ఇంట్లోంచి రోజూ నవ్వులు వినిపిస్తుంటాయ్, ఏంటి, మీ సంతోష రహస్యం?

ఇరుగమ్మ: ఏం లేదు, మా ఆయన రోజూ నా మీద చెప్పులు విసురుతుంటాడు; అవి నాకు తగిలితే ఆయన నవ్వుతాడు; తగలకపోతే నేను నవ్వుతాను. దేవుడి దయ వల్ల మా జీవితం నవ్వులమయంగా సాగిపోతోంది!



కొత్త బేతాళం

విక్రం ఎప్పటిలాగే స్టేషనుకు వెళ్లాడు.

ఎప్పుడూ రకరకాల కేసులతో వ్యస్తంగా ఉండే స్టేషను కొన్నాళ్లుగా ఎందుకనో, కేసులేమీ లేక, బందురోజున బీసెంటు రోడ్డు లాగా ఖాళీగా ఉంది. కానిస్టేబుళ్లు, రైటరు, హోంగార్డులు అందరూ ఎక్కడివాళ్లక్కడ ఊరికే ఉన్నారు.

'ఏదో వింత కేసు రాబోతోంది' అని ఎదురుచూడటం మొదలెట్టాడు విక్రం-

'ఇట్లా చాలా సార్లు జరిగింది: స్టేషను ఖాళీ అయ్యిందంటే వింతకేసు ఏదో ఒకటి వస్తుంది' అనుకున్నాడు.



అంతలోనే ఫోను-"అయ్యా, ఇన్స్పెక్టరు గారూ! పెద్ద సమస్య ఒకటి వచ్చి పడింది. దాన్ని మీరేనట, పరిష్కరించగలవారు- రమ్మంటారా?" అని.

"ఇంతకీ మీరెవరో చెప్పారు కారు" అన్నాడు విక్రం. "సమస్యేంటో కూడా చెప్పలేదు. నా వల్ల అవుతుందో, లేదో చూడాలి."

"నన్ను ప్రొఫెసర్ సిద్ధప్ప అంటారు-రోబాటిక్స్ శాస్త్ర పరిశోధకుడిని. ఈ ఊరి చివర్లో మాకో ప్రయోగశాల ఉంది. మీరు చూసే ఉంటారు-"ఉజ్జా రోబోస్" అని పెద్ద క్యాంపస్.

"తెలుసు- చెప్పండి."

"మాకో పెద్ద సమస్య వచ్చి పడింది. మిమ్మల్ని కలిసి మనవిచేస్తాను-"

"సరే, రండి."

ప్రొఫెసర్ సిద్ధప్ప సన్నగా, పొడుగ్గా లావుపాటి కళ్ల జోడుతో బవిరిగడ్డంతో; జుబ్బా వేసుకొని స్వామీజీలాగా ఉన్నాడు. "మాకో సెంట్రల్ రోబాట్ ఉంది. దాని పేరు బేతాళం." వచ్చి కూర్చొని చెప్పసాగాడు.

"బేతాళం లేనిదే మాకు ఒక్క పూట గూడా గడవదు. దానికి సొంతంగా ఆలోచించే శక్తి ఉంది- 'అదెలా సాధ్యం అనకండి. ప్రస్తుతపు మనిషి మెదడు కంటే వందరెట్లు చురుకుగా పనిచేసే సామర్థ్యం ఉండేట్లు, దానంతట అది- తార్కికంగానే కాక, సృజనాత్మకంగా కూడాను- పనిచేసేట్లు, దాన్ని తయారు చేశాం. బయటి ప్రపంచంతోటి సంబంధం లేకుండా కృత్రిమ వాతావరణంలో పెంచాం. వెలుతురు నుండి అది తన శక్తిని గ్రహించగలదు; బ్యాటరీలను ఛార్జ్

చేసుకోగలదు..."

"చెప్పండి, ఇప్పుడేమైంది"

"అది ప్రకృతిలోకి వచ్చింది! ఖచ్చితంగా చెప్పాలంటే చెట్టెక్కి కూర్చున్నది. మా క్యాంపస్‌లో వెనకగా ఓ పెద్ద మర్రి చెట్టు ఉంది. నాలుగురోజుల క్రితం బేతాళం తన గదిలోంచి పారిపోయి ఆ చెట్టెక్కి కూర్చున్నది. వాతావరణాన్ని, గాలి కదలికలనీ, చెట్టు కణాలలో మార్పునీ, మేఘాల సాంద్రతనీ, ఎండ వేడిని- ఇంకా రకరకాల మార్పులు అన్నిటినీ కొలుచుకుంటూ, అక్కడే కూర్చున్నది. ఏం చేసినా క్రిందికి దిగి రావట్లేదు- వేరే ఏమీ మాట్లాడట్లేదు.."



"మరి నేనేం చేయగలను?"

"బేతాళాన్ని ఎలాగైనా ఒప్పించి క్రిందికి దాని గదిలోకి తేవాలి. దాన్ని ఎవ్వరమూ బలవంత పెట్టలేం; పెట్టి ప్రయోజనం లేదు- దానంతట అది రావాల్సిందే. ఎలాగో ఒకలాగా దాన్ని ఒప్పించి క్రిందికి తేవటం మీ ఒక్కరికే సాధ్యం. దయచేసి రండి. దాంతో మాట్లాడండి. మీ కష్టాన్ని వృధా పోనివ్వం- మీరు ఎంతంటే అంత ప్రతిఫలం ఇస్తాం" చెప్పాడు సిద్ధప్ప.

విక్రం అతనితో బాటు పోయి వాళ్ల క్యాంపస్‌లోని భవనాలన్నీ చూశాడు.

చెట్టుమీద ఎక్కి కూర్చొని ఉంది బేతాళం.. తను చెట్టెక్కేందుకు వీలుగా పెద్ద నిచ్చెన ఒకటి వేసి ఉన్నది.

విక్రం చిరునవ్వు నవ్వి నిచ్చెన ఎక్కటం మొదలెట్టాడు..

వెంటనే బేతాళం 'కికికికి' అని నవ్వింది.

"వచ్చావా, నీ కోసమే ఎదురుచూస్తున్నాను. నన్ను ఒప్పించి మళ్లీ ఎసి గదిలోకి తీసుకెళ్దామనేగా, నువ్వొచ్చింది? నాకు తెలుసు. కానీ అసలు సంగతేంటో తెలీనిది, పాపం నీకే. అయినా నిన్ను చూస్తే నాకు కోపం రావట్లేదు; జాలివేస్తున్నది. ఎందుకంటే నీది మంచి మనసు, నీ శరీరం గట్టిది.' అట్లాంటి మనసును, శరీరాన్ని యీ సిద్ధప్పలాంటి వాళ్ళకు తాకట్టు పెడుతున్నావే!' అని నాకు చాలా బాధవేస్తున్నది-”

"అయినా నువ్వొచ్చావు కాబట్టి, నిన్ను కాదనలేక, చెట్టుదిగి నీతో వస్తా; అలసట తెలీకుండా ఉండేందుకు గాను దారిలో నీకో కథకూడా చెబుతా. అయితే నేను చెప్పే కథని నువ్వు నోరెత్తకుండా వినాలి. ఇది మరచిపోయి నోరెత్తావంటే, ఆ తర్వాత ఇక నా చెట్టు నాది, నీ దారి నీది- సరేనా?" అని ఓ కథ మొదలు పెట్టింది... (సశేషం)



లైఫ్ ఇన్సూరెన్స్!

అప్పారావు బీచ్‌లో నిలబడి పారాచూట్లు అమ్ముతున్నాడు-

అప్పారావు: రండి! రండి!అపూర్వమైన పారాచూట్లు! అద్భుతమైన పనితనం! వీటిని వేసుకొని ఎంత ఎత్తు నుండైనా దూకండి! ఒక్క బటన్ నొక్కారంటే చాలు- గుమ్మటం తెరుచుకుంటుంది! ఎంత గడ్డు పరిస్థితుల్లోనైనా మిమ్మల్ని కాపాడుతుంది! రండి!కొనండి!

అక్కడే నిలబడి ఉన్న సుబ్బారావు అపనమ్మకంగా అడిగాడు-

సుబ్బారావు: మరి బటన్ నొక్కినా గుమ్మటం తెరుచుకోకపోతే..?

అప్పారావు: దాన్ని పట్టుకురండి నా దగ్గరికి! పని చెయ్యని దానికి డబ్బులు నూటికి నూరుశాతం వాపస్! గ్యారంటీ!

నవ్వు!



చెట్టుకూ ప్రాణముంది

పిల్లలు రాసిన కథల్లో నిజంగా ఉత్తమ శ్రేణికి చెందిన కథ ఇది ! చదివి ఎలా ఉందో చెప్పండి...

రచన:లావణ్య, జడ్.పి.హెచ్.స్కూల్, గుండువారి పల్లి, తలుపుల మండలం, అనంతపురం జిల్లా.

గుండువారిపల్లి జిల్లా పరిషత్ పారశాలలో ఏడో తరగతి చదువుతున్నది లావణ్య. ఆదివారం బడికి సెలవు కదా, దాంతో తల్లిదండ్రులతో పాటు పొలం పనికి పోయింది.

అక్కడ తల్లిదండ్రులు వాళ్ళ పనుల్లో మునిగిపోయారు. "నేను కూడా ఏదైనా పని చేయాలి" అనుకున్నది లావణ్య. అక్కడ ఉన్న రకరకాల పనిముట్లలో తనకు నచ్చింది ఏంటి అని చూసింది. ఓ గొడ్డలిని చేతపట్టుకున్నది. ఆ తుప్పనీ, ఈ కంప చెట్టునీ కొట్టుకుంటూ పోయింది.

అట్లా అట్లా పొలం చుట్టూ తిరిగింది; మరింత పనికోసం వెతికింది. చూస్తే పొలం ప్రక్కన ఖాళీ భూమిలో ఎత్తైన వేప చెట్టు ఒకటి కనిపించింది. ఆ చెట్టు మీద చాలా గిజిగాళ్ళు- అందంగా గూళ్ళు కట్టుకొని ఉన్నాయి.

కొంచెం సేపు ఆ గూళ్లను అందుకునేందుకు ప్రయత్నించింది లావణ్య. అవేమో దట్టమైన కొమ్మల్లో ఎత్తుగా వ్రేలాడుతున్నాయి.

కొంచెంసేపు ప్రయత్నించాక లావణ్యకు అలుపు వచ్చింది; కోపం కూడా వచ్చింది.



"చెట్టును కొట్టేస్తే ఇంక మీరు ఎక్కడుంటారే?!" అన్నది. వెంటనే చెట్టును కొట్టేసేందుకు పూనుకున్నది. అనుకున్నదే తడవు గొడ్డలికి పని పెట్టింది. అయితే చెట్టు చాలా గట్టిగానే ఉన్నది. కొంచెం సేపు కొట్టాక ఆ పాపకు అలుపు వచ్చింది. అంతలోనే వాళ్ళ అమ్మ వాళ్ళు అక్కడికొచ్చారు. ఈ పాప చేస్తున్న పనిని చూశారు.

"పాప బలే పని చేస్తున్నది" అన్నారు అమ్మతో పాటు వచ్చిన పనివాళ్ళు, ముచ్చట పడుతూ.

అమ్మ మాత్రం పాప దగ్గరికి వచ్చి "పచ్చని చెట్టు కదమ్మా! కొట్టేస్తే పాపం, దానికి నొప్పి పుడుతుంది కదా? చెట్టును అట్లా కొట్టకూడదు తల్లీ. రా, ఇంటికి పోదాం" అని పిల్చుకుపోయింది.

బాగా పని చేసి అలసిపోయిన లావణ్య ఆరోజు సాయంత్రం అంతా బావిలో స్నానం చేస్తూ గడిపింది.

మరుసటి రోజున పాఠశాలలో పర్యావరణ దినోత్సవం జరిగింది. జిల్లా విద్యాధికారిగారు బడికి ముఖ్య అతిథిగా వచ్చారు. స్టేజీ మీద చాలా మంది పర్యావరణం గురించి మాట్లాడారు: "చెట్లకు కూడా ప్రాణం ఉంటుంది. అవి కూడా మనుషుల్లాగే, మిగిలిన ప్రాణుల్లాగే బాధపడతాయి; ఆనందపడతాయి" అని వాళ్ళు చెబితే, వింటున్న లావణ్య ఆశ్చర్యపడింది. "అమ్మ కూడా ఇట్లాగే చెప్పిందే!" అనుకున్నది.

"ఈ విషయాన్ని మన భారతీయ శాస్త్రవేత్త 'జగదీష్ చంద్రబోస్' కనుక్కున్నారు. ఆయన కనుక్కున్న యంత్రం మొక్కల సంవేదనలను కొలిచి, ప్రపంచానికంతటికీ తెలియజేసింది" చెప్పారు సైన్సు అయ్యవారు.



ఈ మాటలు వింటుంటే తను కొట్టబోయిన వేప చెట్టు గుర్తుకొచ్చింది లావణ్యకు. చాలా సిగ్గు వేసింది. ఆ రోజున పాఠశాలలో చాలా చురుకుగా పని చేసింది ఆ పాప. ఇరవై చెట్ల కోసం గుంతలు త్రవ్వింది; ఇరవై మొక్కలు నాటింది! అన్నిటికీ నీళ్ళు తెచ్చి పోసింది!

సాయంత్రం ప్రధానోపాధ్యాయుడిని అడిగి ఒక మొక్కను ఇంటికి తీసుకుపోయింది. మరుసటి రోజు పొద్దున్నే పొలానికి పోయి, తను నరికేద్దామనుకున్న వేప చెట్టుకు దగ్గరగా ఈ మొక్కను నాటింది. పాదు చేసి, నీరు పోసింది.

కొన్నాళ్లకు సంతోషంతో ఆ మొక్క చిగుర్లు వేస్తే, దాని కోసమే రోజూ వెళ్ళి చూస్తున్న లావణ్య అంతకంటే ఎక్కువ సంతోషపడింది.



సమయ పాలకుడు!

వెంగళప్ప చాలా సేపటినుండి పెళ్ళి భోజనం చేస్తూనే ఉన్నాడు. చాలా మంది రావటం, తినటం, వెళ్లటం జరిగాక, అతని దగ్గరికొచ్చి సుబ్బారావు అడిగాడు-

సుబ్బారావు: ఏంటి, ఇంకా ఎంత సేపు భోం చేస్తావు?

వెంగళప్ప: ఏంటో, నాకు కూడా కష్టంగానే ఉంది గానీ, ఈ కార్డు మీద వీళ్ళు రాసిన టైం చూశావా- "డిన్నర్: రాత్రి 7 నుండి 12 వరకూ"! అంతసేపు తినమంటే ఎట్లా, ఎవరినైనా?



ఆడపిల్లలే ఆధారం

రచన: జి. మహేంద్ర వర ప్రసాద్, పదవ తరగతి, జెడ్.పి.హెచ్.స్కూల్, నాగ సముద్రం.

నాగసముద్రంలో రామయ్య, రాధమ్మ అనే దంపతులు ఉండేవాళ్ళు. వాళ్ళ పిల్లలు రాణి, రమేష్- ఇద్దరూ పదవ తరగతి చదువుతున్నారు. రామయ్య, రాధమ్మ పేదవారైనా, పిల్లల్ని మటుకు లోటు తెలీకుండా చూసుకునేవారు.

రమేష్‌కు క్రికెట్ అంటే చాలా ఇష్టం. బాగా ఆడేవాడు కూడాను. ఒక రోజు వాళ్ల బడి తరపున ధర్మపురిలో క్రికెట్ ఆడేందుకు పదకొండు మందిని ఎంపిక చేసారు. రమేష్ కూడా అందులో ఎంపికయ్యాడు.

వాడు క్రికెట్‌కోసం ఎంపికైనందుకు తల్లిదండ్రులు చాలా సంతోష పడ్డారు. వాడికి ప్రత్యేకమైన ఆహారం తెచ్చి పెట్టారు. తీరా ధర్మపురి వెళ్ళే రోజున- "అమ్మా నాకు రాను పోను, ధర్మపురి ఖర్చులకు గాను డబ్బు కావాలి. ఇవ్వు" అన్నాడు రమేష్.

"నా దగ్గర ఎక్కడ ఉన్నాయి? మీ చెల్లెలు

రాణి దగ్గర ఉన్నాయిగా, తీసుకో" అంది అమ్మ.

"రాణీ! డబ్బులివ్వు!" అన్నాడు రమేష్.

"నా దగ్గర ఎక్కడున్నాయి, లేవు!" అంది రాణి.

"ఎందుకు లేవు- నేను చూపించనా? నీ పెట్టెలోవి డబ్బులు కాదా?" అన్నది అమ్మ.

"అవి నేను కూలి పని చేసి సంపాదించుకున్న డబ్బులు. నీకు ఇవ్వను. నా స్కూల్ ఫీజుకోసం ఉంచుకున్నాను" అరిచింది రాణి.

"నేను అడిగితే కూడా ఇవ్వవా? నీకెంత క్రొవ్వు?!" అంటూ రాణి దగ్గర ఉన్న డబ్బును లాక్కుని రమేష్ కు ఇచ్చింది రాధమ్మ.

రాణి గొల్లున ఏడవటం మొదలు పెట్టింది.

అది చూసి రాధమ్మకు ఇంకా కోపం వచ్చింది. "నువ్వు ఏమైనా మమ్మల్ని ఉద్ధరిస్తావా? వాడు అంతే- మగవాడు కాబట్టి ఇస్తాము" అని అరిచింది. రాణి కళ్ళు నీళ్ళు పెట్టుకొని తండ్రివైపు చూసింది. తండ్రి కూడా 'అదంతే' అన్నట్లు తల త్రిప్పుకున్నాడు.

అంతకు ముందు, ఆ తర్వాత కూడా ఇట్లాంటి సంఘటనలు చాలా జరిగాయి. భోజనం దగ్గర, పనుల దగ్గర, చదువుల దగ్గర- అన్ని చోట్లా రమేష్‌ను, రాణిని వేరు వేరుగా చూసేవాళ్ళు అందరూ.

దాన్ని గురించి ఆలోచించిన కొద్దీ రాణికి తిక్కపట్టినట్లు అయ్యేది. చాలా బాధగా అనిపించేది. దాంతో చదువుల్లో అంతకు ముందు ఉన్నంత ఉత్సాహం కనబరచలేక పోయింది.



రాణి వాళ్ల క్లాస్ టీచర్ గారు చాలా మంచిది. రాణి నిరుత్సాహంగా ఉండడం చూసి ఆవిడ 'ఏంటమ్మా అలా ఉంటున్నావు?" అని అడగ్గానే ఇంటిలో జరిగేదంతా చెప్పి కళ్ల

నీళ్ళు పెట్టుకున్నది రాణి.

"చూడు రాణీ! సమాజం ఇట్లానే ఉంది. ఆడపిల్ల అంటే చులకన. నువ్వు బాగా చదువుకొని మీ ఇంటివాళ్లకు, ఊరివాళ్లకు అందరికీ బుద్ధిచెప్పాలి. నీ పరీక్షకు కావలసిన డబ్బులు నువ్వే సంపాదించుకో. నీవల్ల కాకపోతే నేను నీకు డబ్బు సాయం చేస్తాను. స్వతంత్రంగా ఉండు; బాగా చదువుకో; జ్ఞానం పెంచుకో- అంతే. ఇంకేమీ ఆలోచించకూడదిప్పుడు!" అని ప్రోత్సహించిందావిడ.



అప్పటి నుండి రాణి తీవ్రంగా శ్రమించింది. రాత్రింబవళ్ళు చదివింది. రాను రాను ఇంట్లోవాళ్ళు కనీసం ఆ పాప పుస్తకాలకు కూడా డబ్బు ఇచ్చేవాళ్ళు కాదు. అయినా పాపం, ఏదో ఒక పని చేసుకుంటూ అవసరమైనన్ని డబ్బులు సంపాదించేది రాణి. చివరికి పబ్లిక్ పరీక్షలు వచ్చాయి. ఆ సమయంలో రాణి దగ్గర పరీక్షా కేంద్రానికి వెళ్ళేందుకు కూడా డబ్బులు లేవు.

రమేష్ ప్రొద్దున ఏడు గంటలకు లేచి, ఆటోలో పరీక్షా కేంద్రానికి వెళ్ళేవాడు. తల్లి దండ్రులు వాడికి ఆటో డబ్బులు ఇచ్చి పంపేవాళ్ళు! కానీ, 'ఎట్లా వెళ్తున్నావు?' అని కూడా అడిగేవాళ్ళు కాదు, రాణిని!

రాణి ఆ సమయంలో రోజూ పొద్దున్నే నాలుగు గంటలకే నిద్ర లేచి, అడ్డదారిలో పరీక్షా కేంద్రానికి నడిచి పోయేది. అయినా పరీక్షలన్నీ బాగా రాసింది. చివరకు ఎలాగో పరీక్షలు గడచాయి.

సెలవుల తర్వాత ఫలితాలు వచ్చాయి: రాణికి జిల్లాలోనే అందరికంటే ముందుస్థానం! "నేను కాలేజికి వెళ్తానే, వాళ్ళు నన్ను ఉచితంగా చదివిస్తారు" అని రాణి అంటే

తల్లిదండ్రులు చప్పుడు చేసేవాళ్ళు కాదు- "ముందు రమేష్ సంగతి చూడనివ్వు. ఎంత ఫీజు కట్టాల్నో ఏమో" అనేవాళ్ళు. చివరికి వాడికి ఇరవైవేలు కట్టి కాలేజీలో చేర్పించి, "ఆడపిల్లవి, నీకు చదువు అవసరమా! నోరు మూసుకొని ఇంట్లో కూర్చో" అనేశారు రాణిని!

కొద్ది రోజులకు ఓ స్వచ్ఛంద సంస్థ వారు వచ్చి "మీ పాప చాలా చక్కగా చదువుతుంది. మేం మీ అమ్మాయికి ఉచితంగా విద్య అందిస్తాం. కలెక్టరుగారు ప్రత్యేకించి మీతో మాట్లాడమన్నారు. ఆ పాపను మాతో పంపించండి" అన్నారు.

అనగానే, "ఏం అవసరంలేదు. ఆడపిల్ల ఇంతవరకు చదువుకున్నది చాలు. మా అమ్మాయి- మా ఇష్టం" అన్నది రాధమ్మ!

ఇక భరించలేని రాణి తిరగబడింది: "కుదరదు! నేను చదువుకుంటా. అంతే!" అంటూ వాళ్లతో గొడవ పెట్టుకుని స్వచ్ఛంద సంస్థ వారి సహాయంతో కాలేజీకి, హాస్టలుకు వెళ్లటం మొదలు పెట్టింది. తల్లిదండ్రులకు ఆమె మీద ఎంత కోపం వచ్చిందంటే, వాళ్ళు ఇక ఆమెను ఇంటి గడప త్రొక్కనివ్వలేదు!

అయినా రాణి బాగా చదువుకున్నది. ప్రతి సంవత్సరం జిల్లాలో ప్రథమ స్థానంలో నిల్చింది. మంచి ఉద్యోగస్థురాలు కూడా అయ్యాక, అప్పుడు మళ్ళీ ఇంటికి వచ్చింది!



ఆ సమయానికి రమేష్ పెళ్ళి జరుగుతున్నది. ఇంటిలో అడుగు పెట్టగానే రాణి తల్లిదండ్రులు "ఏమే, ఎందుకు వచ్చావు? మళ్ళీ ఎందుకు వచ్చావు, వెళ్ళిపో!" అంటూ రాణిని బయటికి గెంటేశారు. రాణికి బాధ వేసింది గానీ, "ఆడపిల్ల అంటే అలుసు" అని తమ టీచర్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చింది- తల్లిదండ్రుల మీద ఇంతైనా

కోపం చేసుకోకుండా తిరిగి వెళ్ళిపోయింది.



ఇక పెళ్ళి చేసుకున్న రెండు నెలలకే తల్లిదండ్రులను బయటికి గెంటేశాడు రమేష్. అప్పటినుండి రామయ్య, రాధమ్మ ఊళ్ళో సత్రంలో ఉండటం మొదలు పెట్టారు. అది తెలుసుకున్న రాణి వెంటనే వచ్చి, "అన్న బయటికి గెంటేస్తేనేమి? నేను ఉన్నాను కదా, రండి! మన ఇంటికి వెళ్దాం!" అని తన ఇంటికి తీసుకు వెళ్ళింది. వాళ్లకు ఏ లోటూ లేకుండా బాగా చూసుకున్నది.

రామయ్యకు, రాధమ్మకు ఇప్పుడు అర్థమైంది- "ఆడపిల్లలే ఆధారం" అని.

కోరికలే గుర్రాలైతే?!

మంత్రిగారు అనంతపురం జిల్లాలో గ్రామానికి విచ్చేశారు. గ్రామసభ జరుగుతోంది...

వెంగళప్ప: మంత్రిగారూ! మీరు దయచేసి వెంటనే మాకు ఒక డ్యాం శాంక్షను చేయాలి!

మంత్రిగారు (చిరునవ్వుతో): చేస్తాను. కాని మీ ఊరికి దగ్గరలో ఏ నదీ లేదే?!

వెంగళప్ప: అయితే మీరు వెంటనే మాకొక నదిని కూడా శాంక్షను చేయాలి.

నవ్వు

వెంగళప్ప టీవి చూస్తున్నవాడు హడావిడిగా లేచి అంతటా వెతకటం మొదలుపెట్టాడు.

భార్య: ఏంటి వెతుకుతున్నావు?

వెంగళప్ప: రహస్య కెమెరా ఉంటుంది, ఎక్కడో వెతుకు!

భార్య (కొంతసేపు వెతికాక): ఐనా మీకెందుకు వచ్చింది అనుమానం?

వెంగళప్ప: లేకపోతే మనం ఈటివీ చూస్తున్నట్టు వాడికెలా తెలుస్తుంది? మాటి మాటికీ 'మీరు ఈటివి చూస్తున్నారు' అని మొత్తుకుంటున్నాడుగా?



కాకి-కోయిల

రచన: గాయత్రి, ఎనిమిదవ తరగతి, పి.వి.ఆర్.జడ్.పి.హెచ్.స్కూల్, గుండువారి పల్లి.



అనగనగా ఒక అడవిలో ఒక చెట్టు ఉండేది. దాని మీద గూడు కట్టుకొని ఓ కాకి నివసిస్తూ ఉండేది. కొంచెం దూరంలోనే మరో చెట్టు మీద ఒక కోయిల నివసించేది.

ఒకసారి ఓ పెద్ద గాలివాన వచ్చింది. ఆ గాలివానకు కోయిల గూడు కాస్తా చెదిరి పోయింది. కోయిల పూర్తిగా తడిసిపోయింది. అయినా గాలివాన ఎంతకీ తగ్గలేదు. కోయిల, పాపం,

తట్టుకోలేకపోయింది.

చివరికి అది చలికి వణుక్కుంటూ కాకి దగ్గరికి వెళ్లి, "కాకమ్మా, కాకమ్మా!ఈ ఒక్క రోజూ నన్ను నీ గూటిలో తల దాచుకోనివ్వమ్మా! గాలి వానలో నా గూడంతా కూలిపోయింది!" అంది.

కానీ కాకి అన్నది- "నా గూటిలో పిల్లలు నిద్రపోతున్నారు తల్లీ. ముందు నువ్వు ఇక్కడి నుండి వెళ్లిపో, లేదంటే వాళ్ల నిద్ర చెడిపోతుంది. ఎట్లాగూ నేను నిన్ను నాగూట్లోకి రానిచ్చేది లేదు" అని.

"కనీసం ఈ వాన ఆగేంతవరకూ నీ గూటి అంచునైనా తలదాచుకోనివ్వు" అంది కోయిల చలికి వణుకుతూ.

"నీకు ఎన్ని సార్లు చెప్పాలి?! పిల్లలు నిద్రపోతున్నారు. ఇక్కడి నుండి వెళ్లు!" అని దాన్ని తరిమేసింది కాకి.

అంతలోనే గాలివాన ఆగిపోయింది. మెల్లగా మేఘాలన్నీ తొలగిపోయాయి. ఎప్పటిలాగే సూర్యుడు ప్రకాశించాడు. కోయిల మళ్ళీ తన పాత చెట్టు మీదే ఇంకో గూటిని కట్టుకున్నది. గత అనుభవం ఉంది కనుక, ఈసారి మరింత గట్టిగా కట్టుకున్నది ఇంటిని.



కొన్ని రోజుల తర్వాత మళ్లీ ఇంకొక గాలివాన మొదలయింది. కోయిల ఇల్లు గట్టిగా కట్టుకున్నది కదా, అందుకని అది ఇప్పుడు చక్కగా నిలబడింది. కానీ, ఈసారి కాకి గూడు మటుకు ఘోరంగా చెదిరిపోయింది. ఆ గూటిలో పాపం దాని పిల్లలు కూడా ఉన్నాయి! అందుకని అది పడుతూ లేస్తూ కోయిల ఇంటి దగ్గరకు వెళ్ళి "కోయిలమ్మా, కోయిలమ్మా! దయ తలచి మమ్మల్ని నీ గూటిలోకి రానిస్తావా, పిల్లలు తడిసిపోయి వణుకుతున్నారు. కాస్తంత సేపు, ఈ గాలి, వాన ఆగేదాకా నా

పిల్లల్ని నీగూటిలో తలదాచుకోనివ్వవా, నీకు పుణ్యం ఉంటుంది" అన్నది- "నేను ఇంతకు ముందు దాన్ని మా ఇంట్లోకి రానివ్వలేదుగా, ఇప్పుడు అది నన్ను రానివ్వదు- తరిమేస్తుంది" అని మనసులో భయపడుతూనే.



కానీ కోయిల కాకిలాంటిది కాదు. "ఏమీ పరవాలేదు, నువ్వు మళ్లీ గూడు కట్టుకునేంత వరకూ మీరంతా ఇక్కడే ఉండవచ్చు" అని తలుపు తీసి వాటిని లోపలికి రానిచ్చింది.

దాని మంచితనాన్ని చూసి కాకికి సిగ్గు వేసింది. "పోయినసారి గాలివాన వచ్చినప్పుడు నేను నిన్ను నా గూట్లో కనీసం అడుగు కూడా పెట్టనివ్వలేదు. ఇప్పుడు నువ్వు ఆ సంగతిని మనసులో పెట్టుకోకుండా నన్ను, నా పిల్లల్ని లోపలికి రానిచ్చావు. నీ మంచితనం నా కళ్ళు తెరిపించింది. ఇకమీద ఎవ్వరితోటీ తప్పుగా ప్రవర్తించను. నన్ను క్షమించమ్మా, కోయిలమ్మా" అని కంట తడి పెట్టింది.

"ఏమీ పర్వాలేదులే, తోటి ప్రాణులం, ఒకరికొకరం ఆ మాత్రం సాయం చేసుకోకపోతే ఎలాగ? ఇందులో క్షమాపణలేమీ అక్కర్లేదులే" అన్నది కోయిల తేలికగా. అటుపైన కోయిల, కాకి అడవిలోని పక్షులన్నిటికీ సాయం చేస్తూ సుఖంగా ఉండినై.



తొందర!

వెంగళప్ప మిత్రుడు: ఒరే, అకస్మాత్తుగా కారు వేగం పెంచినట్లున్నావు, ఎందుకు?

వెంగళప్ప: ఏంలేదు, కారు బ్రేకులు ఫెయిలయ్యాయి, ఏదైనా యాక్సిడెంటు జరిగేలోగా మనం ఇల్లు చేరితే మంచిదని!



మొసలి-పీత

రచన: దేవకి, 6 వ తరగతి, రిషీవ్యాలీ స్కూల్

అనగనగా ఒక అడవిలో ఒక చెరువు ఉండేది. ఆ చెరువులో ఒక మొసలి, ఒక పీత ఉండేవి. వాటికి చెరువులో ఉండే చేపలన్నా, పురుగులన్నా చాలా ఇష్టం. రోజూ లెక్కలేనన్ని చేపల్ని, పురుగుల్నీ పట్టుకొని నములుతూ ఉండేవి ఆ రెండూ.

ఒకరోజున అవి రెండూ ముచ్చట్లు పెట్టుకుంటూ చేపల్ని నములుదామని చూస్తే అసలు ఎక్కడా ఒక్క చేప కూడా లేదు! చెరువులో అంతటా కనీసం ఒక్క పురుగు కూడా లేదు!

"అయ్యో! మనం అన్ని చేపల్నీ, అన్ని పురుగుల్నీ కూడా తినేసినట్లున్నామే! మరి ఇప్పుడు ఏం చెయ్యాలి?" అంది పీత బాధగా, కడుపు పట్టుకొని.

మొసలి కొంతసేపు మౌనంగా ఆలోచించి, "ఆ...ఐడియా! మనం ఇప్పుడు ఇంక జంతువులని పట్టుకొని తినాలి!" అంది.

ఆ మాట వినగానే పీతకు నీరసం వచ్చేసింది. "ఐడియా బాగుంది; కానీ జంతువులు ఎప్పుడోగానీ మనం ఉండే ఈ చెరువుకు రావు కదా, మరి వాటిని మనం ఎలా పట్టుకోగలం, అసలు?" అన్నది.

"ఏమో! మన అదృష్టం బాగుంటే ఒకదాని తర్వాత ఒకటి లెక్కలేనన్ని జంతువులు వచ్చి నేరుగా మన నోట్లోకే పడచ్చు!" అన్నది మొసలి "అంతగా జంతువులు మన నోట్లోకి దూకకపోయినా ఏమీ పర్లేదు. నువ్వు వాటితో ఏమైనా ముచ్చట్లు పెట్టుకొని వాటి మనసు మళ్ళిస్తూ ఉండు. నేను దొంగగా వచ్చి వాటి మీదికి దూకి చంపేస్తా. అప్పుడు ఇక మనిద్దరి సమస్యలూ తీరతాయి" అని జోడిస్తూ.

కానీ మూడు రోజుల పాటు ఒక్క జంతువు కూడా ఆ చెరువు దరిదాపుల్లోకి రాలేదు! పీత దాదాపు నిరాశ చెందుతూ ఉండగా అకస్మాత్తుగా ఒక జింక అటువైపుగా వచ్చింది.

పథకం ప్రకారం దాన్ని పలకరించేందుకు వెళ్లసాగింది పీత. అయితే ఆకలి పట్టలేని మొసలి ఆ లోగానే జింకమీదికి దూకబోయింది. అలికిడికి భయపడ్డ జింక ఒక్క ఉదుటున బయటికి గెంతి, పరుగే పరుగు!



అట్లా చేతికందిన ఆహారం తప్పించుకొని పోయాక, మొసలి మరొక పథకం వేసింది. "ఇదిగో చూడు! మనం ఇక్కడ ఇట్లా కూర్చుంటే జంతువులేవీ ఇటువైపుకు రావు; మన ఆకలీ తీరదు. అందుకని నువ్వు ఇప్పుడు అడవిలోకి ఏడుస్తూ వెళ్ళి, కనబడ్డ జంతువుకల్లా చెప్పు- నేను చనిపోయానని! బాగా నటించాలి. నీ కళ్ళనీళ్ళు నిజం అనుకొని కనీసం ఒక వంద జంతువులన్నా

ఇటు చెరువు ప్రక్కకు రావాలి. అప్పుడు నేను రహస్యంగా వాటిని ఒక్కొక్కదాన్నే చెరువులోకి లాక్కొని పోయి చంపేస్తాను" అన్నది.

పీత అడవిలోకి బయలుదేరింది. అది ఇంకా పది అడుగులు అటు వేసిందో లేదో, దానికో నక్క ఎదురైంది. పీత గబగబా కొంత ఉమ్మిని కళ్ళక్రింద పులుముకొని నక్క దగ్గరికి వెళ్ళి "నక్కమామా! నీ పియమైన అల్లుడు మొసలి ఇక లేదు. మీ కడసారి చూపు కూడా దక్కకుండానే తనువు చాలించి స్వర్గలోకానికి వెళ్ళిపోయాడు" అన్నది బొంగురు గొంతుతో.

"అవునా! మొసలి చచ్చిపోయిందా! నిజంగానే?! అంత బలంగా ఉండేదే!!" అన్నది నక్క అనుమానంగా.

"పాపం, మరి, అవును" అన్నది పీత, ఇంకేమనాలో తెలీక.

"ఊరికే మూర్ఛ పోయిందేమో, నాకు చూపించు కొంచెం " అని నక్క చెరువు వైపుకు దారి తీసింది.

అక్కడ చెరువు అంచున ఇసకలో కదలకుండా పడి ఉన్నది మొసలి. నక్క దానికి బాగా దూరంగా నిలబడి "ఇదేంటి, చచ్చిపోయిన నక్కలు గాలి పీల్చుకోవాలి కదా! దీని గాలి నిలబడింది- అంటే దానర్థం ఇది కేవలం మూర్ఛ పోయిందని!" అన్నది.

దాని మాటలు వినగానే మొసలి గాలి పీల్చుకొని వదలటం మొదలు పెట్టింది.



దాన్ని చూడగానే నక్కకు అర్థం అయిపోయి, నవ్వు వచ్చింది. అయినా ఐ నవ్వును ఆపుకొని అన్నది "ఊఁ అవును. గాలి పీలుస్తున్నది. అంటే చచ్చిపోయినట్లే. కాని మా అమ్మ నాకు చెప్పేది, చనిపోయిన నక్కలు తోక ఊపుతాయి అని. మరి ఈ

మొసలి తోక ఊపట్లేదేమి?" అంది పీతతో.

మొసలి తటాలున తోక లేపి ఊపింది.

నక్క నవ్వుతూ దూరంగా జరిగి- తిక్క మొసలీ! చనిపోయిన జంతువులు ఎక్కడైనా గాలి పీలుస్తాయా, తోకలు కదిలిస్తాయా! పిచ్చి అబద్దాలు చెప్పి మమ్మల్ని మోసం చేస్తారా!" అంది వెళ్లిపోతూ.

తరువాత ఆ నక్క అడవిలోకి వెళ్లి అడవిలో ఎంతమందికి ఈ విషయం చెప్పిందో గాని, ఒక్క జంతువు కూడా ఆ చెరువు వైపుకు రాలేదు. తిండి లేక పీత, మొసలి రెండూ చనిపోయాయి.



ఎంగుళూరు!

విమానం బెంగుళూరులో దిగబోతుండగా లోపల కూర్చున్న చింటు అరిచాడు

చింటు: బెంగుళూరు వచ్చేసింది! బెంగుళూరు వచ్చేసింది!

ఎయిర్ హోస్టెస్: బాబూ! బి సైలెంట్!

చింటూ: ఎంగుళూరు వచ్చేసింది! ఎంగుళూరు వచ్చేసింది!

జోకు!

లాల్‌మిర్చి-హరిమిర్చి

(ఎండు మిరప-పచ్చి మిరప)

సుజాత: భాయ్‌సాబ్! ఒక కిలో లాల్‌మిర్చి ఇవ్వండి.

కరీం దుకాణదారు: హరిమిర్చ్ ఏక్ కిలో దో!

సుజాత: హరి మిర్చి కాదు-లాల్‌మిర్చ్!

కరీం దుకాణదారు(మళ్లీ): హరిమిర్చ్ ఏక్ కిలో దో!

సుజాత (మళ్లీ చికాకుగా): హరి మిర్చి కాదు-లాల్‌మిర్చ్!

కరీం దుకాణదారు: శాంతంగా ఉండండమ్మా మీకు కావలసినవే వస్తాయ్. మావాడి పేరు హరి.



నన్ను కాపాడిన పిల్లి!

రచన: ఆర్య అచ్యుత, 7 వ తరగతి, రిషీ వ్యాలీ స్కూల్



ఒకరోజున మేం అందరం బంతి ఆట ఆడుతుంటే ఎవరో కొత్త పిల్లాడు ఒకడు కనిపించాడు. నేరుగా మా దగ్గరికి వచ్చి, అడిగాడు- "నేను కూడా మీతో ఆడచ్చా" అని.

వాడిని చూడగానే నాకు గుర్తొచ్చింది- ఆ రోజునే మా అక్క మాకో పని ఇచ్చింది: "చెప్పిన పదాలతో కథ రాయండి" అన్నది. ఇప్పుడు ఇంక "వీడి చేతే కథ చెప్పిద్దాం"

అనుకున్నాను.

"ఇదిగో, నువ్వు మాతో ఆడుకోవచ్చు: అయితే ముందు నీ కథ చెప్పాలి. ఆ కథలో **'సముద్రం, అమ్మమ్మ ఇల్లు, దొడ్డి కంపు, పిల్లి, నాగు పాము'**- ఈ ఐదు సంగతులూ తప్పకుండా రావాలి" అన్నాను.

వాడు ఏమాత్రం ఆలోచించకుండానే చెప్పటం మొదలెట్టాడు:





"నేను ఇంకో దేశం నుంచి వచ్చాను. ఒక చిట్టి పడవలో సముద్రం దాటి వచ్చాను- విన్నారుగా, **సముద్రం**!" "సరే- సరే- ముందుకు పో!" అన్నాను నేను.

వాడు కొనసాగించాడు- "సముద్రం దాటి వచ్చాక, కొన్నాళ్ళు పాటు ఉండి పోదామని మా అమ్మమ్మ వాళ్ల ఇంటికి వచ్చాను. అర్థమైంది కదా, **అమ్మమ్మ ఇల్లు**!'"

"సరిగ్గా ఆ సమయానికే వాళ్ల మరుగుదొడ్డికి ఉండే గొట్టం విరిగింది. ప్లంబరు వచ్చి మొత్తం కడిగి రిపేరు చేస్తున్నాడు. అక్కడ అంతా ఒకటే దొడ్డి కంపు! అర్థమైంది కదా, **దొడ్డి కంపు**!" ఆగాడు వాడు. "బలే ఉందిరా, నీ కథ- చెప్పు ఇంకా" అన్నాం.





"ఇక్కడ, ఈ ఊళ్ళో మా పిన్ని ఉంటుంది. అందుకనే మేము ఇక్కడికి వచ్చాం. వచ్చీ రాగానే నాకు- ఉం..- ఒక **పిల్లి** కనిపించింది. అది కొంచెం కుంటి పిల్లి. అందుకని నాకు అది ఏమంత నచ్చలేదు. బాగా తరిమాను దాన్ని. అయినా అది నన్ను వదలక, నా చుట్టూనే తిరుగుతూ వచ్చింది" ఆపాడు వాడు. "ముందుకు పో!" అన్నాను నేను.

"అయితే ఇందాక, మధ్యాహ్నం ఏం జరిగిందో మీరు ఊహించను కూడా ఊహించలేరు" అన్నాడు వాడు.

"ఏమైంది?" అన్నాం అందరం, ఉత్సాహంగా.



"నేను తలుపు తీసుకొని తోటలోకి నడిచానా, అంతలోనే పిల్లి నా ముందుకి దూకి, కాళ్లకు అడ్డంగా తిరుగుతూ అరవటం మొదలెట్టింది. నేను దాన్ని అదిలిస్తూ కాళ్ళు ఇట్లా విసిరానో లేదో- 'బుస్' మని పెద్దగా శబ్దం! చూసే సరికి నా కాళ్ల ముందే ఓ పెద్ద **నాగు పాము**! దాని మీదికి దూకి పోరాడుతూ ఆ కుంటి పిల్లి! ఒక్క అడుగు ముందుకు వేసినా ఆ పాము నన్ను కరిచేది; నేను ఇట్లా మీతో ఈ సంగతి చెప్పగలిగేవాణ్ణి కాదు!" అన్నాడు వాడు కథని ముగిస్తూ.

మేమందరం వాడి దగ్గరికెళ్ళి "నువ్వు బలే కథలు చెబుతావురా! నిజంగా జరిగినట్టే చెబుతావు!" అన్నాం.

"కాదు! ఇది కథ కాదు- నిజం!" అన్నాడు వాడు. అది చెబుతుంటే వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మేం వాడిని ఓదార్చాం. ఆ తర్వాత అందరం కలిసి ఆడుకున్నాం.



రంగయ్య: డాక్టరు గారూ! నేను కళ్ల జోడు పెట్టుకున్నాక చదవగలుగుతాను కదాండి?!

డాక్టరు: ఓ ఖచ్చితంగా!

రంగయ్య (సంతోషంగా): హమ్మయ్య! అట్లా అయితే సరే. లేకపోతే చదువురాని ఈ జీవితం ఎందుకు?!



వేటగాడి మాట

రచన: భవ్య, 7 వ తరగతి, రిషివ్యాలీ స్కూలు, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు చుక్కాపురం. ఊరు చాలా చిన్నది- అందుకని అక్కడ బడి లేదు. ఎవరన్నా బడికి వెళ్ళాలంటే పొరుగూరికి వెళ్లాల్సిందే.

ఆ ఊరికి కూడా నడచుకొని వెళ్ళాలి- అందుకనే అప్పట్లో చుక్కాపురం వాళ్ళు ఎవ్వరూ అసలు ఏమీ చదువుకోలేదు: ఇప్పుడు కూడా ఎవ్వరూ బడికి పోయేవాళ్ళు లేనే లేరు!

చిట్టి చిట్టి పిల్లలు ఊరికే రోజంతా ఆటలాడుకుంటూ ఉండేవాళ్ళు; కొంచెం పెద్ద పిల్లలు వాళ్లను చూసుకుంటూ ఉండేవాళ్ళు; ఇంకా పెద్ద పిల్లలు వాళ్ళ తల్లిదండ్రులతోబాటు పొలంలో పనికి పోయేవాళ్ళు; మరీ పెద్ద పిల్లలు ఐతే పెళ్ళి చేసుకొని వంట పనుల్లో మునిగిపోయి

ఉండేవాళ్ళు.

ఆ ఊళ్లో కమల, విమల అనే అమ్మాయిలు ఇద్దరూ మంచి స్నేహితులు. పట్నాల్లో ఉన్న బంధువుల పిల్లలు శుభ్రంగా చదువుకుంటుండటం చూసి, 'మేమూ బడికి పోతాం' అనటం మొదలు పెట్టారు వాళ్ళు.

వాళ్ళను వెనక్కి లాగేందుకు చాలామంది పెద్దవాళ్ళు ప్రయత్నించారు. "మీకెందుకే, చదువు?" అన్నారు. "పెద్ద పెద్ద మగోళ్ళే పొలం పనులు చేసుకుంటా ఉంటే, మీరేంటి చదివేది?" అన్నారు. "అబ్బ చదవొ-చ్చారమ్మా, చదివి కలెక్టర్లు అవుతారు!" అని ఎగతాళి చేశారు.

అయినా కమల విమల ఇద్దరూ పట్టిన పట్టు విడవలేదు. "ఇక్కడికే కాదు- ఎంత దూరమైనా పోతాం. బడికి పోవాల్సిందే" అని పోరాడారు.

చివరికి వాళ్ల ఇంట్లోవాళ్ళు వీళ్ళ పోరు పడలేక, "సరే, మీకు కష్టమయ్యేంత వరకూ బడికి పోండి. అటుపైన ఎట్లాగూ మీరే మానేస్తారు" అని వదిలిపెట్టారు.

దాంతో వాళ్లు ఇద్దరూ బడికి పోవటం మొదలెట్టారు. టీచర్లు చెప్పినవన్నీ శ్రద్ధగా విని, నోట్సులు రాసుకొని- మంచి పిల్లలు అనిపించుకోసాగారు.

అన్నీ బాగున్నాయి కానీ వాళ్ళకు ఒక్కటే భయం- సాయంత్రం ఐదు గంటలకు వదులుతారు బడి. చలికాలంలో మరి ఐదున్నరకల్లా చీకటిపడిపోతుంది; ఆ చీకట్లో దారి సరిగ్గా కనిపించదు. అడవి దారి అసలు ఏమాత్రం సరిగ్గా ఉండదు. ఎప్పుడైనా దారి తప్పారంటే అంతే- ఇక రాత్రంతా అడవిలో తిరుగుతూ ఉండాల్సిందే.

"మన ఊరి వాళ్లను ఎవరినైనా మనకు ఎదురు రమ్మందాం" అన్నది కమల. "ఊరుకో, వాళ్లను ఎదురు రమ్మంటే ముందు మనల్నే బడి మాన్పిస్తారు. ఇంకో మార్గం ఏదైనా వెతకాల్సిందే" అన్నది విమల. చివరికి ఆ సంగతి ఎటూ తేలలేదు.

అయినా ఒక రోజున వాళ్ళు భయపడినంతా అయ్యింది: ఉదయాన్నే లేచి ఇద్దరూ చక్కగా నడుచుకుంటూ బడికి వెళ్లారా, కానీ సాయంత్రందారి తప్పి ఎటో అడవి

మూలల్లోకి వెళ్లిపోయారు! చీకటి పడింది.. ఇంటికెళ్లే దారి ఇక ఏమాత్రం కనబడకుండా అయ్యింది!



పాపం ఇంక ఇద్దరికీ ఏం చేయాలో అర్థం కాలేదు. "నాకు చాలా భయంగా ఉంది- ఏడవాలనిపిస్తున్నది. ఆకలి వేస్తున్నది" అన్నది విమల.

"ఇదిగో, ఊరికే భయపడకు. ఏదైనా కష్టం వస్తే ధైర్యంతో ఎదుర్కోవాలి తప్ప, భయపడకూడదు- అని చెప్పలేదా, టీచరుగారు? నువ్వు ఊరుకో. ఏమైతే అది కానియ్యి! రేపు ఎట్లాగూ సూర్యుడు వస్తాడు కద!" అంటూ బ్యాగులో ఉన్న మొక్కజొన్న కంకిని బయటికి తీసింది కమల. ఇద్దరూ కలిసి ఓ చెట్టెక్కి కూర్చొని, కంకిని తిన్నారు.

"మరి మనం పడుకోవచ్చా, పాములు పుట్రలు వస్తే ఎలాగ?" అన్నది విమల ఇంకా భయపడుతూ.

"ఆంజనేయస్వామిని తలచుకుంటే ఏవీ మనదగ్గరకు రావంటలే" అన్నది కమల. ఇక ఇద్దరూ ఆంజనేయస్వామిని తలచుకుంటూ ఆ కొమ్మ మీదనే కూర్చున్నారు.

అంతలో అటుగా పోతున్న వేటగాడొకడు వీళ్ళని చూసి దగ్గరికొచ్చి- "ఏ ఊరు పాపా, ఇంత చీకటి వేళ ఇక్కడున్నారు?" అని అడిగాడు. తమని కాపాడేందుకు ఆంజనేయస్వామే ఇట్లా వచ్చాడనిపించింది పిల్లలకు. ఇద్దరూ గబగబా కొమ్మ దిగి వచ్చి అతనికి గోడు అంతా వెళ్లబోసుకున్నారు.

"పెద్దల మాట వినాలి కదమ్మా, బడికి పోకపోతే మటుకు ఏమి? నాకూ ఓ పాప ఉన్నది మీ అంతది. బడికి పోతానంటే నేనే, పంపియ్యలేదు. ఇప్పుడు ఇంట్లోనే ఉంది.

చక్కగా పనులు చేసుకుంటూ" అని, వాళ్లను వెంటబెట్టుకొని, కబుర్లు చెబుతూ అడవి దాటించాడు వేటగాడు.

ఆ సరికి చుక్కాపురం మొత్తం గందరగోళమౌతున్నది- 'వద్దన్నా వెళ్ళారు పిల్లలు- ఇంత చీకటైనా వెనక్కి తిరిగి రాలేదు" అని. వీళ్లను చూడగానే అందరి ప్రాణాలూ లేచి వచ్చాయి. "ఇంక ఏనాటికీ పిల్లల్ని బడికి పోనివ్వం" అని పిల్లల్నిద్దరినీ దగ్గరికి తీసుకున్నారు.



కమల విమల ఏడుపు మొదలు పెట్టారు. "లేదు- మళ్ళీ ఇట్లా జరగదు- మేం బడికి వెళ్ళాల్సిందే" అనసాగారు. పెద్దవాళ్ళు వాళ్ళని కసరటం మొదలెట్టారు. అందరూ తమకు తోచిన విధంగా మాట్లాడుతుంటే వేటగాడు ఊరికే నిలబడ్డాడు కొంత సేపు.

అంతలో కమలవాళ్ళమ్మ అతని దగ్గరికొచ్చి "ఇంత జరిగినా బుద్ధి రాలేదు చూడయ్యా ఈ పిల్లలు ఎట్లా ఉన్నారో!" అంది.

వేటగాడు కొంచెంసేపు ఆలోచించి మెల్లగా అన్నాడు- "మీరేమీ అనుకోకపోతే నేనోమాట చెప్పనా తల్లీ-" అని. అందరూ నిశ్శబ్దం అయ్యారు- "ఈ పిల్లలిద్దరూ నిజంగా గొప్ప తెలివైన వాళ్ళు తల్లీ, గొప్ప ధైర్యవంతులు కూడా. చదువు వీళ్లకు చాలా సంగతులు నేర్పించింది. వీళ్ళతో అక్కడినుండీ మాట్లాడుతూ వచ్చాను కద, నాకు కూడా అర్థమైంది- పిల్లలకు చదువు చాలా అవసరం. నిజంగా ఇవాళ్ల నా మనసులో గట్టిగా అనిపించిందమ్మా- మా పిల్లనీ బడికి పంపాలని! మీరు ఏమీ అనుకోకపోతే, వీళ్లని బడికి పోనివ్వండి- నేను కూడా మా అమ్మిని అటునుండి బడికి పంపుతాను. అంతా కలిసి చదువుకుంటారు; కలిసి వెనక్కి తిరిగొస్తారు. ఎవరికీ ఏమీ కష్టం ఉండదు!" అని.

ఊళ్ళోవాళ్లంతా మౌనంగా తలలూపారు.

అటుపైన కమల విమలలతో పాటు చుక్కాపురం పిల్లలు అందరూ బడికి పోవటం మొదలెట్టారు!





పిల్లి-నక్క

సేకరణ: డి.ఆశ, ఏడవ తరగతి, గుండువారి పల్లి, తలుపుల మండలం, అనంతపురం జిల్లా.

అనగనగా ఒక అడవిలో గొప్పలు చెప్పుకునే నక్క ఒకటి ఉండేది. అది ఒట్టి దుస్సుది- నిజంగా దానికి ఏమీ తెలివి లేదు; కానీ ఊరికే తెలివైనదాని లాగా పోజులు పెడుతూ తిరిగేది.

ఆ అడవిలోనే పిల్లి ఒకటి ఉండేది. నిజానికి అది చాలా తెలివైనది. బ్రతికేందుకు కావలసిన తెలివితేటలు దాని దగ్గర పుష్కలంగా ఉన్నాయి. కానీ నక్క ఎప్పుడూ దాన్ని తక్కువ చేసి మాట్లాడుతుండేది, అయినా అది ఏమీ అనేది కాదు.

ఒక రోజున అది నక్కతో అన్నది- "మామా! నా చెవులు ఎందుకనో ఈరోజున బాగా వణుకుతున్నాయి- సాధారణంగా వేట కుక్కలు రాగానే నాకు ఇట్లా అవుతుంటుంది. ఈ వేటకుక్కలు మహా ప్రమాదం; వాటి కంట పడ్డామంటే ఇక తప్పించుకునే అవకాశమే ఉండదు!" అని.

"ఆఁ, వాటికి అంత సీను లేదులే" అన్నది నక్క."నేను వాటి పెద్దన్నను కదా, అందుకని అసలు అవి నన్ను ఏమీ చెయ్యవు. ఒకవేళ ఆ సంగతి తెలీక ఏవైనా నా మీదికి వచ్చినా, వాటి నుండి తప్పించుకునే ఉపాయాలు నా దగ్గర కొల్లలు ఉన్నాయి. అయినా ఓ సంగతి చెప్పనా, నీబోటి చిన్న ప్రాణులు ఊరికే భయపడుతుంటాయి- ఎంత చెప్పినా వినవేమిటో మరి! భయాన్ని పోగొట్టుకునే మార్గాలు ఎవరైనా పెద్దలను అడిగి తెలుసుకోవాలి; వాటిని నిలకడగా సాధన చేయాలి- ఏమున్నది?! కుక్కలకు భయపడతారా, ఎవరైనా?!" అని నవ్వింది.

"ఆ ఉపాయాలేవో కొంచెం నాకూ నేర్పించు మామా, నీకు పుణ్యం ఉంటుంది! కుక్కల భయంతో చచ్చిపోతున్నాను" అన్నది పిల్లి, ఏడుపు ముఖం పెట్టుకొని.

"వీలు చిక్కినప్పుడు తప్పకుండా నేర్పిస్తాను. అయినా నాకు ఈమధ్య ఏమంత ఖాళీ దొరకటంలేదు. కొంచెం సమయం చిక్కితే, అప్పుడు నేర్పిస్తాను" అన్నది నక్క గొప్పగా.

సరిగ్గా ఆ సమయంలో హటాత్తుగా ఊడి-పడ్డాయి వేటకుక్కలు! క్షణంలో అవి నక్కను, పిల్లిని చుట్టు ముట్టి గుర్రు గుర్రు మంటూ మీదికి రాసాగాయి!



ఇక పిల్లి అరక్షణం కూడా ఆలోచించలేదు- క్రిందికి వాలిన కొమ్మనొకదాన్ని పట్టుకొని చక చకా ఓ చెట్టుమీదికి ఎగబ్రాకింది.

'తనకు తెలిసిన వంద ఉపాయాల్లో ఇప్పుడు దేన్ని ప్రయోగించాలి?' అని ఆలోచిస్తూ నిలబడ్డ నక్క మటుకు వేటకుక్కల పాలైంది.

ఒక్క ఉదుటున దానిమీదికి దూకిన కుక్కలు అది తమ పెద్దన్న అని కూడా తలచక, దాడి చేసి చంపేశాయి!






పిసినారి రాముడు.


బొమ్మల కథ

రచన: ఎ. శివ, నాలుగవ తరగతి, రిషీ వ్యాలీ స్కూల్.




అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఒక పిసినారి వాడు ఉండేవాడు. వాడి పేరు రాముడు.

ఒకరోజు వాడు ఒక పిల్లిని కొనడానికి జంతువుల అంగడికి వెళ్లాడు. అక్కడ పిల్లిని చూసి" ఈ పిల్లి ఎంత?" అని అంగడి వాడిని అడిగాడు.



"నాలుగు రూపాయలు" అన్నాడు అంగడివాడు.



అప్పుడు రాముడు "రెండు రూపాయలకు ఇస్తావా?" అని అడిగాడు.



"ఇవ్వను. నువ్వు నా అంగడి శుభ్రం చేస్తే
అప్పుడు ఈ పిల్లిని రెండు రూపాయలకు ఇస్తాను" అన్నాడు అంగడి వాడు.

సరే అని అంగడి నంతా శుభ్రం చేశాడు రాముడు, తుమ్ము-కుంటూ.



ఆ తర్వాత సంతోషంగా రెండు రూపాయలు ఇచ్చి పిల్లిని తీసుకొని ఇంటికి వెళ్లాడు.



కానీ అంగడి శుభ్రం చేసినందుకు వాడికి జ్వరం వచ్చింది.



రెండు రూపాయలు ఆదా చేద్దామనుకుంటే హాస్పిటల్ ఖర్చులు రెండు వందలయ్యాయి.

గొప్పవారయ్యేందుకు ఆరాటపడితే సరిపోదు- దానికోసం శ్రమించాల్సి ఉంటుంది.



ఆశాజ్యోతి

రచన: డి.ఆర్.హిమశ్రీ, పదవ తరగతి, రాధా స్కూల్ ఆఫ్ లెర్నింగ్, అనంతపురం.

రాయవరం అనే ఊళ్ళో సరోజ, రామరాజు అనే దంపతులు నివసించేవాళ్ళు. వాళ్ళు బాగా ఆస్తిపరులు; ధనవంతులు. వాళ్ళకు ఉన్నదల్లా ఒకే ఒక్క కొరత- పిల్లలు లేరు అనేది.

పిల్లలకోసం ఎన్నో గుళ్లు గోపురాలు, వ్రతాలు, నోములు, డాక్టర్లు- అంతా అయ్యాక, చాలా కాలానికి వాళ్ళకు ఒక కొడుకు పుట్టాడు. వాడికి సోమరాజు అని పేరు పెట్టుకొని, ఎంతో గారాబంగా పెంచసాగారు వాళ్ళు.

లేకలేక పుట్టిన కొడుకు అనేమో, వాడిని సరోజ అస్సలు ఎండలో తిరగనిచ్చేది కాదు. ఎప్పుడూ ఎసి గదిలోనే ఉంచేది. 'కాళ్ళకు మట్టి అంటితే ఎలాగ?' అని వాడుండే గదిలో ఎప్పుడూ తివాచీ పరచి ఉంచేది. వాడికి ఇంట్లో వేసుకునేందుకు చెప్పులు, ఊళ్ళోకి చెప్పులు, పట్టణానికి చెప్పులు- ఇట్లా అన్నిటికీ వేరు వేరు చెప్పులు ఉండేవి.

రోడ్డుమీద దుకాణాల్లో కనిపించిన వస్తువల్లా కావాలనేవాడు వాడు; కాదనకుండా వాటిని కొనిపెట్టేది సరోజ.

"ఇట్లా చేస్తే పిల్లలు మొద్దుబారిపోతారమ్మా" అని ఎవరు చెప్పినా సరోజకు కోపం వచ్చేది. "నా కొడుకు, నా యిష్టం" అని అరిచేది. వాడు కొంచెం పెద్ద అవగానే వాడిని ఒక ఎసి బడిలో చేర్చారు వాళ్ళు. ఆ బడికి వెళ్ళే బస్సు ఎసిది, తరగతి గదులు ఎసివి, ఆఖరుకు బాత్‌రూంలు కూడా ఎసివే! దాంతో వాడి ఆరోగ్యం గందరగోళం అవ్వటమే కాదు; వాడు మొద్దుగా తయారైనాడు; ఏ పనికీ తరం కాకుండా అయ్యాడు.

చూస్తూ చూస్తూండగానే సోమరాజుకు పదహారేళ్ళు వచ్చాయి. వయస్సైతే పెరిగింది కానీ, వాడికి బాధ్యత ఏమీ తెలీలేదు. పరీక్షల్లో అన్నీ సున్నాలే తెచ్చుకునేవాడు. 'ఏమైంది, ఎందుకు అలాగ' అని వాడిని ఎవ్వరూ అడిగేవారే లేరు మరి!

అంతలో వాడు కొత్త డిమాండ్ ఒకటి మొదలు పెట్టాడు- "కోటి రూపాయలు కట్టి నాకు యంబిబియస్ సీటు కొనిపెట్టండి" అని! దాంతో రామరాజు గుండెల్లో రాయి పడింది- "అదేమీ వద్దులేగాని, ముందు నువ్వు ఒక సంవత్సరం ఊళ్ళో ఉండు" అని వాడిని ఊరికి పిల్చుకొచ్చాడు.

ఊరికి వచ్చిన సోమరాజు ఎలాంటివాడో ఒక్క వారం రోజుల్లోనే ఊరంతా తెలిసిపోయింది. అందరూ వాడిని ముద్దుగా సోమరి సోమరాజు అని పిలవటం మొదలు పెట్టారు!

ఇప్పటికి గానీ సరోజకు తను ఎంత తప్పు చేసిందో తెలీలేదు. కానీ చేతులు కాలాయి; ఇప్పుడు ఏం చేయగలదు తను?

ఆ సమయంలో రామరాజు మిత్రుడు మూర్తి అనుకోకుండా వాళ్ళ ఊరికి వచ్చాడు. మిత్రుడితో తన గోడు వెళ్ళబోసుకున్నాడు రామరాజు. మూర్తి బాగా ఆలోచించి "పిల్లల్ని అతి గారాబం చెయ్యకూడదురా, ఇప్పుడు చూడు ఎంత కష్టం అవుతున్నదో! కానీ గుండెను రాయి చేసుకోండి; నేను చెప్పినట్లు చెయ్యండి. వాడు బాగు పడతాడు- ఏం పర్లేదు" అని ఒక ఉపాయం

చెప్పాడు.

అదే రోజున మూర్తి ఒక లాయర్‌ను వెంట బెట్టుకొని వచ్చాడు- రామరాజు అనుభవిస్తున్న ఇల్లు, ఆస్తి మొత్తం తనదే- అన్నాడు. వాళ్లను ఇంట్లోంచి మొరటుగా బయటికి గెంటించాడు. రామరాజు, సరోజ, సోమరాజు- ముగ్గురూ కట్టుబట్టలతో ఇంటిబయట నిలబడ్డారు. రామరాజు కొడుకుకేసి బాధగా చూస్తూ "నీకు నా విలువ అర్థమైందనుకుంటాను సోమూ. ఇప్పుడిక నేను నీకు ఇవ్వగలిగింది ఇదిగో ఈ వెయ్యి రూపాయలు మాత్రమే.



ఇవి తీసుకెళ్ళి, పట్నంలో నీకు తోచిన పనేదో చూసుకొని బ్రతుక్కో. మా సంగతి వదిలెయ్. మేం ఏదో కూలి చేసుకొని జీవిస్తాం. ఒకసారి నిలద్రొక్కుకున్నాక నువ్వు మళ్ళీ మా గురించి ఆలోచిద్దువు" అని పంపించాడు.

సోమరాజు ఆ డబ్బును తీసుకొని విజయవాడకు వెళ్ళాడు. ఆరోజు సాయంత్రానికే ఆ డబ్బంతా ఖర్చయిపోయింది! ఇప్పుడిక తండ్రికి చెప్పి ప్రయోజనం లేదు- ఆయన దగ్గర కూడా డబ్బు లేదు!

సోమరాజు తనకు పరిచయం ఉన్న వాళ్ల దగ్గరికి వెళ్లి డబ్బు సాయం అడిగాడు. ఒకరిద్దరు ఇచ్చారు- ఆ డబ్బు అయిపోయాక ఇక అందరూ ముఖం చాటు చేసారు.

వారం రోజుల తర్వాత ఇక సోమరాజు చేత డబ్బు లేక, పని ఏదీ చేతకాక, పస్తులుండటం మొదలుపెట్టాడు. రెండు రోజులు గడిచేసరికి ఆకలి బాధ తెలిసి వచ్చింది. చివరికి ఇది కాదని ఒక హోటల్‌లో పనికి కుదురుకున్నాడు. తినేందుకు వచ్చినవాళ్ళకు టిఫిన్లు అందించటం,

మర్యాదగా మాట్లాడటం, హోటల్లోనే తిండి తిని, రాత్రికి పనివాళ్లందరితోబాటు నేలమీదే పడుకోవటం- ఇట్లా నెలరోజులు గడిచాయి.



హోటల్ యజమాని వాడికి నెలజీతం ఇచ్చాడు.

సోమరాజు ఆ డబ్బును ఖర్చు చేయలేదు- దాచి పెట్టుకొని, తండ్రికి ఫోను చేశాడు- "నాన్నా! మీరేం కంగారు పడనక్కర్లేదు- నేను ఓ చిన్న పని చూసుకున్నాను; నెలకు వెయ్యి రూపాయలు జీతం కూడా సంపాదిస్తున్నాను. మీకు అక్కడ కష్టంగా ఉందేమో, డబ్బులు పంపమంటారా?" అని అడిగాడు.

రామరాజు కళ్లనీళ్ళు ఒత్తుకొని, "మన కష్టాలన్నీ తీరినయ్ సోమూ, ఇప్పుడిక నువ్వు ఊరికి వచ్చెయ్యి. మన ఇల్లు, ఆస్తి అన్నీ మనవే అయ్యాయి. ఇప్పుడు మళ్ళీ కోటి రూపాయలు కట్టైనా సరే, నిన్ను డాక్టరు చదువులు చదివించగలం. వెంటనే వచ్చెయ్యి" అన్నాడు.

సోమరాజు కొద్దిగా ఆలోచించి- "లేదులే నాన్నా, నేను ఇక్కడే కోచింగ్ తీసుకొని పరీక్షలు రాస్తాను. మంచి ర్యాంకు తెచ్చుకొని తక్కువ ఖర్చుతో డాక్టరు చదువులు చదువుతాను. డబ్బులతో కొనుక్కున్న చదువూ ఒక చదువేనా?" అన్నాడు.

అనటమే కాదు; మరుసటి సంవత్సరం పరీక్షల్లో వాడు మంచి ర్యాంకు సంపాదించి స్వీయశక్తితో యంబిబియస్ సీటు తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఊళ్ళోవాళ్ళు అందరూ అతన్ని డాక్టర్ సోము అంటున్నారు! రామరాజు, సరోజలకే కాదు- అతనిప్పుడు ఊరంతటికీ ఆశాజ్యోతి!



ఆశ-అర్హత

కొన్ని కథల్లో చాలా లోతైన తత్వం ఉంటుంది. జార్జ్ ఆర్వెల్ రాసిన 'యానిమల్ ఫాం' అలాంటి ఓ కథ. ఇదిగో, ఇది కొంచెం వేరేలాంటి మరో గొప్ప కథ. దీని ఉద్దేశం మనల్ని ఆలోచింపజేయటమే! చదవండి, ఆలోచించండి, మీకు ఏమనిపిస్తున్నదో రాయండి.

రచన: వియోగి, కర్నూలు.

సుబ్బన్న చాకలి దగ్గర చాలా ఏళ్లపాటు వెట్టిచాకిరీ చేస్తూ వచ్చింది, దీర్ఘకర్ణం అనే ఓ గాడిద.

పని చేసీ చేసీ అది అలిసి పోయింది. సుబ్బన్న దాని చేత విపరీతంగా పని చేయించుకునేవాడు. తిండి సరిగ్గా పెట్టేవాడు కాదు. దాని బ్రతుకు అలా దుర్భరం అయిపోయాక, అది ఇట్లా ఆలోచించటం మొదలు పెట్టింది:

"చాకలి సుబ్బన్న యిచ్చే నాలుగు గడ్డిపరకలకు నేను ఎందుకు ఊడిగం చేయాలి? శ్రమ నాది; ఆదాయం వాడిది!

నాకు కడుపు నిండా తిండి పెట్టడు; తనేమో తాగి జల్సా చేస్తూ ఉంటాడు! ఎందుకిలాగ? ఈ తేడాను నేను ఎందుకు భరించాలి?" అని, అది మరునాటి రాత్రే కట్లు తెంచుకొని దగ్గర్లోనే ఉన్న నల్లమల అడవులలోకి పారిపోయింది.



అడవిలో ఉన్న గాడిదలు ముందు దీర్ఘకర్ణంకేసి అనుమానంగా చూశాయి. అయితే త్వరలోనే దాని మాటలు విని, దాన్ని అక్కున చేర్చుకున్నాయి. దీర్ఘకర్ణానికి ఇక శుభ్రమైన తిండి, స్వచ్ఛమైన గాలి, తియ్యటి ఏటినీరు దొరికాయి- ఒక్క ఏడాది దాటేసరికి దానికి ఎక్కడ లేని జవసత్వాలు వచ్చాయి.

తోటి గాడిదలన్నిటికీ అది చెప్పేది- "మనిషిని చూసి మనం చాలా నేర్చుకోవాలి! వాళ్లకు ఇప్పుడు రాజులు లేరు: ప్రజాస్వామ్యం వచ్చింది! ప్రజాకర్షణ ఉన్నవాడే నాయకుడు! అంతే తప్ప, జాతివల్లనో, వంశం వల్లనో ఎవ్వరూ నాయకులు కారు. దమ్మున్నవాడిదే రాజ్యం!" అని ఉపన్యాసాలిచ్చేది.

దీర్ఘకర్ణం మాటలు కుర్ర గాడిదల్ని చాలా ఆకర్షించాయి. దాని వాగ్ధాటి వాళ్లందరినీ ఒక ఊపు ఊపింది. తల-తోక నెరిసిన ముసలి గాడిదలు మటుకు దాన్ని పట్టించుకోలేదు.

"ఈ అడవికి రాజు ఎవరు?"దీర్ఘకర్ణం అడిగేది.

"పులిరాజు!" చెప్పింది ఓ కుర్రగాడిద.

"ఎప్పటినుంచి?"

"తెలీదు-"

"నేను చెబుతాను. మా తాత ముత్తాతల కాలంలో ఈ పులిరాజు తాత రాజ్యం చేశాడు. తరువాత ఇతని తండ్రి అధికారం చలాయించాడు. అతడి తదనంతరం ఇప్పటి పులిరాజు రాజ్యమేలుతున్నాడు" చెప్పింది ఓ ముసలి గాడిద.

"అన్యాయం కాదా?! ఇది ఎంత ఘోరమైన అన్యాయమో చూడండి! కొంచెం ఆలోచించండి- ఎప్పుడూ పులిజాతే రాజ్యం ఏలితే, మరి మిగతా జంతువులకు రాజ్యమేలే అవకాశం ఎట్లా వస్తుంది? వాటికి అసలు ఆ అవకాశం ఉండనే ఉండదా? ఎందుకుండదు? ఎక్కడినుండి వచ్చింది ఈ అసమానత్వం?!" ఆవేశపడి పోయింది దీర్ఘకర్ణం.

అన్ని గాడిదలూ మౌనం వహించాయి: చెవులు టపటపలాడించాయి; తోకలతో ఈగలు తోలుకున్నాయి; దిక్కులు చూశాయి. "ఈ అన్యాయాన్ని నేను ఖండిస్తున్నాను. ఈ సారి మన జాతికి రాజ్యాధికారం దక్కాల్సిందేనని నేను ఏకగ్రీవంగా తీర్మానిస్తున్నాను!" ఘోషించింది దీర్ఘకర్ణం.

గాడిదలన్నీ గుసగుసలు పోయాయి.

చివరికి ఓ పండు ముసలిగాడిద అడిగింది: "నువ్వు చెప్పింది వినడానికి బాగుంది మనవడా! కాని రాజ్యమేలే శక్తి మనకుండాలిగా?! అంత నైపుణ్యం మనకెక్కడినుండి వస్తుంది? పుట్టినప్పటినుండి అణిగిమణిగి సేవలు చేసే వాళ్లం మనం! మనకు అధికారం ఎలా ప్రాప్తిస్తుంది? వచ్చినా రాజ్యమేలేంతటి శక్తియుక్తులున్నవాడు మనలో లేడే!"

దీర్ఘకర్ణం గట్టిగా ఓండ్ర పెట్టి వెనుక కాళ్లతో నేలని తన్నింది: "మన శక్తిని మనమే తక్కువ అంచనా వేసుకుంటున్నాం! తెలివిలోను, బలంలోను మనం ఎవరికీ తక్కువ కాదు. కాకపోతే మనం శాంతి కాముకులం- అంతే! అంతెందుకు, నాకు ఒక్కసారి అధికారం యిమ్మనండి- ఈ పులిరాజు కంటే బాగా రాజ్యం చేస్తాను!" చెప్పింది ఆత్మవిశ్వాసంతో.

యువగాడిదలన్నీ అవునంటూ తలలూపాయి. "దీర్ఘకర్ణం! మా నాయకుడు!" అని నినాదాలు చేశాయి.

మరునాడు ముసలి గాడిదను తీసుకొని అవన్నీ పులిరాజు దగ్గరకు పోయాయి. ఇన్ని గాడిదలను ఒక్కసారి చూడగానే కాలికి బుద్ధి చెప్పింది నక్క మంత్రి. భల్లూకం సైన్యాధికారి గందరగోళంలో పడింది.

"ఏంటి సంగతి?" అని పులిరాజు గాండ్రించింది. యువగాడిదలన్నీ ఆ గాండ్రింపుకు భయపడ్డాయి. అయినా ఏవీ బయట మాత్రం పడలేదు. ముసలిగాడిద వినయంగా పులిరాజు చెవిలో జరిగినదంతా చెప్పింది.

పులిరాజుకు అదంతా భలే వినోదంగా అనిపించింది. అది చిరునవ్వు నవ్వింది. "ఉట్టికి ఎగర లేనమ్మ, స్వర్గానికి ఎగురుతానన్నదట! రాజమకుటం నిజానికి ఓ ముళ్ల కిరీటం! ఆశలు అందరికీ ఉంటాయి- కలలు కనడంలో తప్పులేదు- కానీ అర్హత లేకుండా అర్రులు జాస్తే? అది మూర్ఖత్వం అవుతుంది" అన్నది.

"అలా ఎందుకనుకుంటావు పులిరాజా! మాకు ఒకసారి అవకాశం ఇచ్చి చూడు గదా?! మేం సమర్థులమో, కామో నీకే అర్థమవుతుంది. కాలం మారింది- ఇప్పుడు పుట్టుకతోటే ఎవరూ రాజులు కారు. రాజులు ఇకనుండి ఎన్నుకోబడతారు. జాతిని బట్టి శక్తిని అంచనా ఎందుకు వేస్తావు? భగవంతుని సృష్టిలో అందరూ సమానులే!" ఉపన్యాసం యిచ్చింది దీర్ఘకర్ణం.

పులిరాజుకు అరికాలి మంట నెత్తికెక్కింది. దీర్ఘకర్ణం ఒక్కతే వచ్చి ఉంటే ఈ పాటికి ఒక్క పంజా విసిరి ఎక్కడికో పంపించి ఉండేవాడు. కాని అన్ని గాడిదల ముందు తన ప్రతాపం పనికి రాదని తలచి, ఉదారంగా ప్రవర్తించాడు: "మంచిది! ఈ రోజు నుండి ఈ అడవికి రాజువి నువ్వే. ఈ అడవిని వెయ్యి కళ్లతో కాపాడు. ఇకనుండి నా దగ్గరికి ఏ సమస్య వచ్చినా, దాన్ని నీ దగ్గరకే పంపుతాను" చెప్పాడు మర్యాదగా.

గాడిదలన్నీ విజయనాదాలు చేస్తూ వెనక్కి మళ్ళాయి. సంబరాలు చేసుకున్నాయి.

అంతలోనే 'ఎవరో దొంగలు మన అడవిలోని ఎర్రచందనం వృక్షాలను అక్రమంగా తరలిస్తున్నారు' అని వార్త మోసుకొచ్చింది కుందేలు.

వెంటనే కొన్ని యువ గాడిదలను తీసుకొని దొంగల మీదకు దండయాత్రకు వెళ్ళింది దీర్ఘ కర్ణం.

కొన్ని వందల గాడిదలు ఒక్కసారిగా తమ మీదికి రావడం చూసి, భయపడి, పారిపోయారు దొంగలు. దాంతో గాడిదలన్నీ విజయోత్సవాలు జరుపుకున్నాయి.

కొన్ని రోజులకు మదించిన ఏనుగుల గుంపు ఒకటి ఎక్కడినుంచో వచ్చి, అడవిలో స్వైరవిహారం చేయడం మొదలెట్టింది. కనిపించిన చెట్లనల్లా ధ్వంసం చేస్తున్నది. చిన్న ప్రాణులను కాళ్లతో త్రొక్కేస్తున్నది. ఘీంకారాలతో ఎవరికీ నిద్ర పట్టకుండా చేస్తున్నది.

దీర్ఘకర్ణానికి చాలా కోపం వచ్చింది. యువ సైన్యాన్ని సమాయత్త పరచింది. ఒక్కసారిగా ఏనుగుల మీదికి దండెత్తింది. అయితే ఎందుకనో, మరి ఏనుగులు వీటికి భయపడలేదు. అవన్నీ తిరగబడ్డాయి! ఘీంకరిస్తూ మీదకి వచ్చాయి!

దాంతో చాలా గాడిదలు భయపడి పారిపోయాయి.

దీర్ఘకర్ణం మటుకు ధైర్యంగా ఒక మదగజాన్ని నిలువరించింది. దానికి తిక్కరేగి, దీర్ఘకర్ణాన్ని తొండంతో ఎత్తి, ఒక్క విసురు విసిరింది! దాంతో నడుములు విరిగినంత పనయింది దీర్ఘకర్ణానికి. అయితే దాని అదృష్టం: అది పులిరాజు గుహకు దగ్గర్లో పడింది!

"పులిరాజా! శరణు శరణు ! మన రాజ్యం మీదికి ఏనుగులు దండెత్తాయి. నాశనం చేస్తున్నాయి. మీరు వచ్చి కాపాడాలి!" కాళ్లు జోడించి ప్రార్థించింది దీర్ఘకర్ణం.

"నాకేం పని దీర్ఘకర్ణీ?! నేనిప్పుడు ఈ అడవికి రాజును కాదు. నువ్వే రాజువు; కాబట్టి ఆ గొడవేదో నువ్వే చూసుకో!" అంటూ లోపలికి పోయాడు పులిరాజు.

దీర్ఘకర్ణం కాళ్ళావేళ్ళా పడింది: "మహాప్రభో! వీటిని తోలడం నా వల్ల కావట్లేదు. తమరే రక్షించాలి! పాహిమాం! పాహిమాం!"

"అయితే నాకేంటి లాభం?" విసుగ్గా అడిగాడు పులిరాజు.

"అయ్యా! మీ రాజ్యం మీరే ఏలుకోండి. మేము, గాడిదలం, తపస్సు చేసుకుంటాం; మా బ్రతుకు మేము బ్రతుకుతాం!"

"అదెట్లా కుదురుతుంది? ఇన్నాళ్లు రాజ్య సుఖాలు అనుభవించావు; ఇప్పుడు శత్రువులు దండెత్తి వస్తే, రాజ్యం వద్దంటున్నావు- ఇది అవకాశ వాదం!" పులిరాజు అన్నది.

"మహాప్రభో! బుద్ధి వచ్చింది! రాజ్య కిరీటం అన్నది ముళ్ల కిరీటం అని నాకు తెలీదు- ఎవరు చేసే పనులు వాళ్లు చేయాలి. సృష్టిలో అంతా సమానం అనుకున్నాను; కానీ ప్రతి జంతువుకూ దాని సామర్ధ్యానికి తగిన పనులు కల్పించి ఉన్నాడు భగవంతుడు. మేము గాడిదలం: బరువులు మోసే పని మాకు సరిపోతుంది. మీరు పులులు: రోషంతో పోరాడటం మీకు సరిపోతుంది. ఇక పదండి: ఆలసిస్తే మన అడవి సర్వనాశనం అయిపోతుంది" అని పాదాలంటింది దీర్ఘకర్ణం.

"అర్థమయిందా! అర్హత లేకుండా అందలం ఎక్కుదామనుకోకూడదు. పనికి తగిన అర్హతను పెంపొందించుకోవాలి. ఇక రా! ఈ ఏనుగుల సంగతి చూద్దాం!" పులిరాజు దాన్ని వెంటబెట్టుకొని ఏనుగుల గుంపు దగ్గరకి వచ్చాడు.



దీర్ఘకర్ణం వెనక్కి తిరిగి ఏనుగును తన్నబోయింది; అయితే ఆలోగానే ఏనుగు తొండంతో దాన్ని ఎత్తి దూరంగా విసిరేసింది.

"ఆయ్! నా స్నేహితుడినే తంతావా?!" అంటూ గాండ్రించింది పులి. ఆ గాండ్రింపుకే ఏనుగులకు మత్తు సగం వదిలి పోయింది.

దీర్ఘకర్ణాన్ని విసిరేసిన ఏనుగు మీదికి దూకింది పులిరాజు.

అంతే! ఒక్క దెబ్బకే ఏనుగులన్నీ తోక ముడుచుకుని పారిపోయాయి.

పులిరాజు వాటి వెంటపడి తరిమాడు, అడవి పొలిమేర దాకా.

"పులిరాజుకూ.. జై!" అరిచింది దీర్ఘకర్ణం.

"జై! జై!" అని అరిచాయి మిగిలిన జంతువులన్నీ.

ఇక అటుపైన దీర్ఘకర్ణం ప్రశాంతంగా ఆలోచిస్తూ అడవిలోనే ముని జీవనం సాగించింది.



రైల్వే స్టేషన్ ముందు స్కూటరును ఆపి హడావిడిగా అడిగాడు సుబ్బారావు..

సుబ్బారావు: అన్నా! స్కూటర్ స్టాండు ఎక్కడుంది?

శాంతారాం: చెబుతాను. నీ పేరేంటి తమ్ముడూ?!

సుబ్బారావు: నా పేరు సుబ్బారావు. గబగబా చెప్పన్నా! ట్రైన్ వెళ్లిపోతుంది!

శాంతారాం: చెప్తాను. మీ అమ్మా నాన్నలు ఏం చేస్తారు!

సుబ్బారావు: అమ్మ డాక్టరు, నాన్న ఇంజనీరు. అన్నా స్కూటర్ స్టాండు ఎక్కడన్నా, తొందరగా చెప్పు!

శాంతారాం: చెబుతాను. నీ పేరు మీద ఆస్తిపాస్తులేమైనా ఉన్నాయా?

సుబ్బారావు: అయ్యో ఉన్నాయి! ఇంతకీ స్కూటరు స్టాండు ఎక్కడన్నా?

శాంతారాం: చెబుతాను. నువ్వు ఎంత వరకు చదువుకున్నావు?

సుబ్బారావు: ఇంజనీరింగు అయిపోయింది. స్కూటరు స్టాండు ఎక్కడంటే ఇవన్నీ అడుగుతావేమి?

శాంతారాం: చూడు, నీ కుటుంబ పరిస్థితి బాగుంది; మీ అమ్మా నాన్నలు ఇద్దరూ ఉన్నత స్థితిలో ఉన్నారు, నీకు చదువు వచ్చు, ఇంజనీరింగ్ పూర్తి చేశావు అయినా నీకు ఇంత మాత్రం తెలివి లేదని నాకు చాలా బాధగా ఉంది. స్కూటరుకు స్టాండు దాని క్రిందనే ఉంటుంది.

సుబ్బారావు: ఆఁ!



పగ

బౌద్ధ కథ

అనువాదం : నారాయణ

చైనాను చింగ్ చక్రవర్తులు పరిపాలిస్తున్న రోజుల్లో 'చెంగ్-పాయ్-లిన్' అనే సాధారణ వ్యక్తి ఒకడుండేవాడు.

అతను తన పని తాను చేసుకునేవాడు; బుద్ధిని పదునుగా ఉంచుకునేందుకు ప్రయత్నిస్తూండేవాడు. అతనికి ఒకరోజున అద్భుతమైన కల ఒకటి వచ్చింది.

కలలో అవలికితేశ్వర బోధిసత్త్వుడు

కనిపించాడు అతనికి: "రేపు చింగ్ సైన్యాలు మీ ఊరిమీద దాడి చేస్తాయి. మీ కుటుంబంలో ఉన్న పదిహేడు మందిలో పదహారు మంది ప్రాణాలతో బయట-పడతారు.



కానీ నీ రాతనుండి మాత్రం నువ్వు తప్పించుకోలేవు. 'వాంగ్-మా-ట్జె' అనేవాడు నిన్ను రేపు చంపేస్తాడు. ఎందుకంటే, గత జన్మలో నువ్వు ఇరబై ఆరు సార్లు కత్తితో పొడిచి చంపావు, వాడిని'! అని చెప్పాడు అతనికి!

'చెంగ్-పాయ్-లిన్' ఏమీ అనలేదు. బోధిసత్త్వుడు ఇంకా చెప్పాడు: "అయితే దీనినుండి తప్పించుకునే పద్ధతి ఒకటి ఉంది: అదైనా ఎంతవరకు పనిచేస్తుందో, తెలీదు- రేపు మధ్యాహ్నానికల్లా చక్కటి విందు ఒకటి తయారు చెయ్యి. 'వాంగ్-మా-ట్జె' రాగానే అతన్ని నీతో బాటు భోజనానికి ఆహ్వానించు. ఆ తర్వాత, అతను నిన్ను చంపేందుకు కూడా వీలు కల్పించు- అట్లా చేస్తే, మరి, పరిస్థితి ఏమైనా మారుతుందేమో".

ఉదయాన్న లేచేసరికి కల ఇంకా స్పష్టంగానే గుర్తున్నది 'చెంగ్-పాయ్-లిన్'కు. అతని మనసును ఆ కల ఏదో బాగానే ప్రభావితం చేసినట్లున్నది: అతను మెల్లగా బయటికి పోయి, రకరకాల కూరగాయలు, స్వీట్లు, సారాయీ అన్నీ కొనుక్కొచ్చి మధ్యాహ్నానికల్లా గొప్ప విందు భోజనం తయారు చేశాడు.

అంతలోనే ఎవరో తలుపు తట్టిన శబ్దం

అయ్యింది! తలుపుతీస్తే, బయట ఎవరో పరిచయం లేని యోధుడు ఒకడు నిలబడి ఉన్నాడు.

"నువ్వేనా, 'వాంగ్-మా-ట్జె'?" అడిగాడు చెంగ్-పాయ్-లిన్.

"ఆశ్చర్యంగా ఉందే, నా పేరు నీకెట్లా తెలుసు? ఉత్తరాన ఉన్న దూరదేశం నుండి నేను ఇప్పుడే యీ ఊర్లో అడుగుపెట్టాను." అన్నాడు తలుపు దగ్గరి యోధుడు.

చెంగ్ అతన్ని ఇంట్లోకి ఆహ్వానించి, అతను లోనికి అడుగు పెడుతుండగా చెప్పాడు- "స్వాగతం! నీకోసం విందు భోజనం ఎదురు చూస్తున్నది. ఇద్దరం కలిసి భోంచేస్తూ మాట్లాడుకోవచ్చు" అని.

ఆశ్చర్యపోతున్న వాంగ్‌కు అతను ముందురోజు తనకొచ్చిన కలను వివరించి, చెప్పాడు- "పోయిన జన్మలో నేను నిన్ను ఇరవై ఆరు సార్లు కత్తితో పొడిచి చంపాను. కాబట్టి యీసారి నీవంతు. నన్ను ఇరవై ఆరు సార్లు పొడిచి చంపేందుకే నువ్వు ఇక్కడికి వచ్చావు. ఒకసారి మనం భోజనం చేసేశాక, అప్పుడు నీపని నువ్వు కానిస్తువు. ముందు భోంచేద్దాం."



'వాంగ్ మాట్జె' దాన్ని గురించే ఆలోచిస్తూ కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు- చివరికి అన్నాడు- "ఇదంతా చాలా చిత్రంగాను, గందరగోళంగాను ఉన్నది. నువ్వు నన్ను పోయిన జన్మలో చంపావు; మళ్లీ అందుకుగాను నేను నిన్ను యీ జన్మలో చంపుతాను; అందుకు గాను మళ్లీ వచ్చే జన్మలో నువ్వు నన్ను చంపవా?- ఇది ఇట్లా పోతూనే ఉంటుంది కదా? అందుకని

వద్దులే, నేను నిన్ను చంపను. ఏమైతే అది కానియ్యి" అని తన కత్తితో చెంగ్‌పాయ్‌లిన్ వీపు మీద ఇరవై ఆరు చిన్న చిన్న గాట్లు పెట్టాడు- "దీంతో మన ఋణం తీరిపోయిందని భావిద్దాం!" అంటూ.

వాంగ్‌మాట్జె అట్లా తనకు భోజనం పెట్టిన వాడిని చంపక వదలటమే కాదు, తర్వాతి కాలంలో అతనికి గొప్ప స్నేహితుడు కూడా అయ్యాడు. అతనే చెంగ్‌కు చెప్పాడు- "నేను వచ్చేదారిలో చూశాను: అనంతమైన చింగ్ సైన్యం ఇటువైపుగానే వస్తున్నది. వాళ్లంతా క్రూరులు, మొండివాళ్లు. తప్పక ఈ ఊరినంతా నేలమట్టం చేసుకుంటూ పోతారు. అందుకని నువ్వు, నీ కుటుంబం మొత్తం వెంటనే బయలుదేరి 'సు-చౌ' కి చేరుకోండి. అక్కడైతే అంతా భద్రంగా ఉండచ్చు" అని. చెంగ్‌పాయ్‌లిన్ అతను చెప్పినట్లే చేశాడు. ఎవరికీ ఏమీ నష్టం కాకుండా అందరూ క్షేమంగా బయట పడ్డారు!

అపకారాన్ని సద్భావనగాను, స్నేహంగాను మార్చుకొనే అవకాశం మన చేతుల్లోనే ఉంటుంది. పగతీర్చుకోవటమా, లేక దాన్నే మైత్రిగా మలచుకోవటమా అనేది ఎప్పటికప్పుడు మనమే ఆలోచించుకొని నిర్ణయించుకోవాలి. విధిరాతని కూడా మార్చే శక్తి మన మనసుకు ఉన్నదనటంలో సందేహం లేదు!



1 న	2 హో	రా	3 ఎ	డా	రి
4 హో	ర	★	5 లు	6 వు	పి
7 యం	తి	★	గు	★	లి
★	★	8 ధం	బం	ను	9 ఆ
10 పా	11 ను	గం	టి	★	★
12 ము	మ	ను	★	13 న	వ్వు

పదరంగం-79 కి సరైన జవాబు పంపించిన వారు ఒక్కరే!

ఎల్. శ్రీజ, 50-B, MIGH,,పాత సంతోష్ నగర్ కాలనీ, హైదరాబాదు-59.

శ్రీజకు ఈ మాసపు కొత్తపల్లిని బహుమతిగా పంపిస్తున్నాం! శుభాకాంక్షలు!



పిలిప్కా అబ్బాయి

రష్యన్ జానపద కథ

అనువాదం - రాధ మండువ, ఉపాధ్యాయిని, రిషివ్యాలీ స్కూలు, మదనపల్లి.

అనగనగా అడవికి దగ్గరగా ఉండే ఓ ఊళ్లో ఒక భార్య-భర్త నివసించే వాళ్ళు. దురదృష్టం, ఎంత కాలానికీ పిల్లలు కలగలేదు వాళ్ళకి!

దాంతో భార్య మానసికంగా కృంగిపోయింది. "ఓ చిట్టి పిల్లవాడిని ఉయ్యాలలో వేసి ఊపి, పెద్ద చేస్తామంటే అసలు మనకి బిడ్డే లేకపోయెనే!" అని తరచూ భర్తతో అంటూ, బాధపడుతూ ఉండేది.

ఒకరోజున భర్త కట్టెలు కొట్టుకు వద్దామని అడవిలోకి వెళ్ళాడు. అక్కడ అతనికి ఒక చెట్టు మొద్దు కనబడింది. అది చాలా ముచ్చటగా, చక్కగా నున్నగా ఉంది.

అతను దాన్ని నరికి అట్లానే ఇంటికి తీసుకొచ్చి భార్యకు ఇచ్చాడు- "ఇదిగో, ఎంత చక్కగా ఉందో చూడు. దీన్నే ఉయ్యాలలో వెయ్యి! ఇదే బిడ్డడనుకుని,

దీన్నే ఊపుతూ జోలపాటలు పాడుకో!" అన్నాడు.

దాన్ని చూడగానే భార్యకు ఎందుకో చెప్పలేనంత సంతోషం వేసింది. ఆమెకది నిజంగానే పిల్లవాడిలాగా అనిపించిందేమో మరి! భర్త చెప్పినట్లే ఆమె ఆ మొద్దుని ఉయ్యాలలో వేసి "ఓ నా చిట్టి పాపా, తెల్లని భుజాల చిట్టి బాబూ, నల్లని కళ్ళ నా నాన్నా, నిదురపోరా నా తండ్రీ నిదురపో, హాయిగా నిదురపో" అంటూ పాడి మురిసిపోయింది.

రెండవరోజు కూడా అలాంటిదే మరో పాట పాడింది ఆమె. అయితే మూడవరోజున పాట పాడుతుంటే ఊయలలో నుంచి చిన్న పిల్లవాడి ఏడుపు వినిపించింది. ఆమె చాలా ఆశ్చర్యపోయి భర్తను కేకేసింది-

చూస్తే ఉయ్యాలలో నిజంగానే ఓ చిట్టి బాబు! తెల్లటి భుజాలతో, నల్లనల్లని కళ్లతో, ముద్దుగా ఉన్నాడు వాడు!

భార్యాభర్తలిద్దరూ ఆ బాబుని చూసుకుని చాలా సంతోషపడ్డారు. పిల్లవాడికి 'పిలిప్కా' అని పేరు పెట్టి అల్లారు ముద్దుగా పెంచుకోసాగారు.

పిలిప్కా పెరిగి పెద్దవాడయ్యాడు. ఒకరోజున వాడు వాళ్ళ నాన్నతో "నాన్నా, నేను చేపలు పట్టేందుకు వెళతాను. నాకు ఒక బంగారు పడవ, ఒక వెండి తెడ్డు తయారు చేసి ఇవ్వవా?" అని అడిగాడు.



"సరేలేరా! అంతకంటేనా!" అని కొడుకు అడిగిన వాటిని సమకూర్చి ఇచ్చి, చెరువులో చేపలు పట్టమని పంపించాడు తండ్రి.

ఇంక చూడాలి! పిలిప్కా రాత్రి-పగలు అదే పనిగా, ఎంతో ఇష్టంగా చేపలు పట్టి ఇవ్వటం మొదలు పెట్టాడు తండ్రికి. అన్నం తినడానికి కూడా తీరిక లేకుండా పనే చేస్తూ

పోయాడు వాడు. వాడిని తలచుకొని వాళ్లమ్మకి ప్రాణం కొట్టుకున్నది- బిడ్డకోసం వేడి వేడి అన్నం వండుకుని, చెరువు గట్టుకు వెళ్ళింది.

“ఓ అబ్బాయ్, పిలిప్కా! నా చిన్నిబాబూ! గట్టుకు రా, నాన్నా! ఎంత రుచికరమైన భోజనం తెచ్చానో తెలుసా, తిన్నావంటే ఇంకా ఇంకా కావాలంటావు!" అని పెద్దగా అరిచి చెప్పింది.

అమ్మ గొంతు విని పిలిప్కా గట్టుకు వచ్చాడు. భోజనం చేసి మళ్ళీ చేపల వేటకి వెళ్ళాడు.

చెరువును ఆనుకొని ఉండే అడవిలోనే 'బాబాయాగా' అనే ఊచకాళ్ళ మంత్రగత్తె ఒకతె ఉండేది. తల్లి రావటం, పిలిప్కాని పిలవటం, వాడు బయటికి రావటం, భోజనం తినటం అంతా చూసింది ఆమె. వాడిని చూస్తే ఆమెకి చాలా ఆశ వేసింది. 'వాడి మాసం ఎంత రుచిగా ఉంటుందో' అని ఆమెకు నోరు ఊరిపోయింది.

'ఎట్లా అయినా వాడిని చంపి తినెయ్యాలి' అని ఆ మంత్రగత్తె ఒక సంచిని, ఇనుప చువ్వను తీసుకుని చెరువు గట్టు మీదికి వచ్చింది. తల్లి లాగానే గొంతు మార్చి "ఓ పిలిప్కా, నా చిన్ని బాబూ! భోజనానికి రా, నాన్నా! ఎంత రుచికరమైన తినుబండారాలు తెచ్చానో చూడు!" అని పిలిచింది.



పిలిప్కా పాపం, అనుమానించలేదు. 'తల్లే పిలిచింది' అనుకున్నాడు; ఒడ్డుకు వచ్చాడు. చివరి నిముషంలో ప్రమాదం కనిపెట్టి పడవని వెనక్కి తిప్పుకునే లోపు బాబాయాగా కాస్తా తన ఇనుపచువ్వని పడవ కొక్కేనికి వేసి, ఒడ్డుకి లాక్కున్నది.

పిలిప్కాని ఒడిసి పట్టుకుని తన సంచిలో కుక్కింది- “హా! ఇంక నువ్వేం చేపలు

పట్టగలవు?! ఎంచక్కా నాకు ఆహారంగా మారగలవు గానీ!" అంటూ సంచిని తన వీపుకు తగిలించుకుని, దట్టమైన ఆ అడవి లోపల ఎక్కడో ఉన్న తన ఇంటికి మోసుకెళ్ళ సాగింది.

బాబాయాగా ఇల్లు చాలా దూరమే. ఇంటికి పోతూ పోతూ ఉంటే- పిలిప్కా చాలా బరువు ఉండే పిల్లవాడు కదా- అందుకని వాడిని మోస్తున్న బాబాయాగాకి చాలా అలుపు వచ్చింది. ఇంకా ఇల్లు చేరుకోకనే, దారి మధ్యలో సంచిని ప్రక్కన పెట్టుకుని, దాని పైన కాలు వేసి, నిద్రలోకి జారుకుంది ఆ మంత్రగత్తె.

'ఏంటి, సంచి కదలట్లేదు?' అని గమనించిన పిలిప్కా మెల్లగా సంచిలోంచి పాకుతూ బయటకు వచ్చాడు. అయినా అలసిపోయిన మంత్రగత్తెకు వాడు బయటికొచ్చిన సంగతి తెలీలేదు. అప్పుడు వాడు సంతోషంగా ఊపిరి పీల్చుకొని, అక్కడే ఉన్న గులకరాళ్ళతో సంచిని నింపేసి, గబగబా చెరువు దగ్గరికి పరుగు పెట్టాడు.

ఆలోగా బాబాయాగా మేలుకున్నది. మెల్లగా సంచిని ఎత్తుకొని ఇంటికి చేరుకున్నది. ఇంట్లో ఉన్న తన కూతురిని పిలిచి, "ఇదిగో, ఈ బెస్తవాడిని మన కొలిమిలో వేసి, చక్కగా వేయించి కూర వండు" అంటూ సంచిని తలక్రిందులుగా చేసి కొలిమి ముందు విదిలించింది.


కానీ పిలిప్కా అందులో లేడు! వాడికి బదులు అక్కడంతా గులకరాళ్ళు వచ్చి పడ్డాయి! దాంతో బాబాయాగాకి పట్టరాని కోపం వచ్చింది. ఆ ప్రదేశం అంతా దద్దరిల్లేట్లు అరిచింది: "హు! వేలెడంత లేవు; నామీదే జిత్తులు ప్రయోగిస్తావా? నీకు సరైన గుణపాఠం నేర్పకపోతే నా పేరు బాబాయాగానే కాదు చూసుకో!" అని అరిచింది, చిందులు వేస్తూ.

మళ్ళీ చెరువు గట్టుకు వెళ్ళింది. ఈసారి కూడా తల్లిలాగే నటిస్తూ పిలిప్కాను పిలవడం మొదలు పెట్టింది: "పిలిప్కా, నా చిన్ని బాబూ! ఒడ్డుకు రా, నాన్నా! నీకు రాత్రి భోజనం తెచ్చాను!" అని పిలిచింది.

"నేను రాను. నువ్వు మా అమ్మవి కావు- మంత్రగత్తె బాబాయాగావి. నీ గొంతు నాకు

బాగా తెలుసు. మా అమ్మ గొంతు సన్నగా ఉంటుంది" అన్నాడు పిలిప్కా.

బాబాయాగా ఎంత పిలిచినా పిలిప్కా మటుకు ఒడ్డుకు రాలేదు. ఆమె పిలుపుని లెక్క చేయలేదు. బాబాయాగా ఆలోచించింది- తన నాలుకని, గొంతును సన్నబరుచుకోవాలని నిర్ణయించుకుంది. వెంటనే కమ్మరి దగ్గరకి పరుగెత్తింది:



"కమ్మరీ, కమ్మరీ! నా నాలుకని సన్నగా చెయ్యి- చాలా సన్నగా!" అంది.

అప్పుడా కమ్మరి "సరే సన్నబరుస్తాను. నీ నాలుకని ఈ డాకలి మీద పెట్టు!" అన్నాడు.

బాబాయాగా పొడవాటి నాలుకని డాకలి మీద పెట్టింది. కమ్మరి తన సుత్తి తీసుకుని ఆమె నాలుక సన్నబడేంత వరకూ అణగగొట్టాడు.

తర్వాతి రోజున బాబాయాగా చెరువు గట్టుకు వచ్చింది. ఈసారి సన్నటి గొంతుతో పిలిచింది- "పిలిప్కా! ఒడ్డుకు రా, నాన్నా! భోజనం చేద్దువు గాని!" అంది.

గొంతు సన్నగా ఉండటంతో తల్లే వచ్చిందనుకున్నాడు పిలిప్కా. చూసుకో-కుండానే ఒడ్డుకు వచ్చాడు. వెంటనే బాబాయాగా వాడిని పట్టుకుని సంచిలో కుక్కింది: "ఇప్పుడు ఇంక నువ్వు నన్ను మోసం చేయలేవు! నాకు ఆహారం కాక మానవు!" అని సంతోషంతో కేరింతలు కొడుతూ ఇంటికి నడిచింది.

ఇక ఈసారి ఎక్కడా ఆగకుండా ఇల్లు చేరుకున్నది ఆమె. వెంటనే కూతురుని పిలిచి, "ఇదిగో, అమ్మాయ్! ఆ జిత్తులమారి వాడిని తెచ్చాను. త్వరగా భోజనం సిద్ధం చెయ్! నేను వెళ్ళి ద్రాక్షరసం తీసుకుని వస్తాను" అని బయటకి వెళ్ళిపోయింది.

మంత్రగత్తె కూతురు కొలిమిని వెలిగించింది. ఒక పెద్ద కొయ్య పెనాన్ని తెచ్చి, పిలిప్కోతో "ఒరేయ్! ఇదిగో, ఈ పెనం మీద పడుకో; నిన్ను కొలిమిలో పెట్టి వేయిస్తాను!" అంది కరకుగా.

పిలిప్కో లేచి పెనం మీద కూర్చున్నాడు. బాబాయాగా కూతురికి చికాకు వేసింది: 'అలా కాదు!' అని మొరటుగా అరిచింది. పిలిప్కోని పట్టుకొని పెనంమీద నిలువుగా పడుకోబెట్టింది. వెంటనే పిలిప్కో ఈసారి కాళ్ళు రెండూ పైకి పెట్టాడు-

మంత్రగత్తె కూతురికి తిక్కరేగింది. "చూడు, చెబుతున్నాను- అట్లా కాదు, పడుకునేది! ఇట్లా పడుకోవాలి-" అంటూ పెనం మీద కాళ్ళు చాచి పడుకున్నది. మరుక్షణం పిలిప్కో పైకి లేచి, ఆమెతో సహా పెనాన్నంతా మొత్తంగా పట్టుకుని లేపి, కొలిమిలో పడేసి మూతపెట్టేశాడు!

ఆమె పెద్దగా కేకలు వేస్తూ కొలిమి లోంచి బయకి దూకబోయింది. వెంటనే పిలిప్కో గభాల్న అక్కడున్న బరువైన రోలుని ఒకదాన్ని ఎత్తి కొలిమి మూత మీద పెట్టేశాడు. దాంతో ఇక ఆమె కాస్తా బయటకు రాకుండా అయ్యింది.

ఆ వెంటనే ఇంట్లోంచి బయటకి పరుగు పెట్టాడు పిలిప్కో. అయితే సరిగ్గా ఆ సమయానికే అటుగా ఇంటికి వస్తున్నది బాబాయాగా! దాంతో పిలిప్కో గబుక్కున ఓ లావుపాటి చెట్టును ఎక్కి, దాని గుబురు కొమ్మల్లో దాక్కున్నాడు.

బాబాయాగా తటాలున ఇంట్లోకి పోయి ముక్కుతో గాలి పీల్చి, "ఆహా! ఎంత మంచి వాసన!" అని మెచ్చుకున్నది. ఆపైన నేరుగా కొలిమిలోంచే మాంసాన్ని బయటికి తీసి తిని, ఎముకలను బయట పారేస్తూ "పిలిప్కో, నా చిన్ని బాబూ, నీ మాంసాన్ని తృప్తిగా తిన్నాను! నీ రక్తాన్ని కడుపునిండా తాగాను! చూశావా!" అని గంతులేయసాగింది.

చెట్టు మీదున్న పిలిప్కో ఇంక ఆపుకోలేక "ఆఁ, చూశానులే! ఇంక ఇప్పుడు క్రింద పడి పొర్లు! నువ్వు తినింది నీ కూతురు మాంసాన్ని!" అన్నాడు గట్టిగా.

ఆ మాటలు వినగానే బాబాయాగా తల

పైకెత్తి పిలిప్కాని చూసింది. ఆమెకు ఎక్కడలేనంత కోపం వచ్చింది. విపరీతమైన కసితో బాబాయాగా నల్లగా మారింది: వికృతంగా అరుస్తూ చెట్టు దగ్గరికి వెళ్ళి, తన పళ్ళతో కాండాన్ని కచకచా కొరికింది.

అయితే అది చాలా దృఢమైన చెట్టు- అందువల్ల కొరికీ కొరికీ మంత్రగత్తె పండ్లు విరిగాయి కానీ చెట్టు మటుకు చెక్కు చెదరలేదు.

అప్పుడింక బాబా యాగా దగ్గరలోనే ఉన్న కమ్మరిని పిలిచింది: "కమ్మరీ, కమ్మరీ! త్వర త్వరగా నాకొక ఒక గట్టి ఉక్కు గొడ్డలిని తయారు చేసి ఇవ్వు!" అని అరిచింది.

కమ్మరి భయపడి, గబగబా ఒక గొడ్డలిని తయారు చేసి ఇచ్చాడు. దానితో చెట్టును నరకడం మొదలు పెట్టింది బాబాయాగా. అయితే పిలిప్కా ఎక్కిన చెట్టు చాలా గట్టిది. దాంతో కాసేపటికే గొడ్డలి పదునంతా పోయింది.

అప్పుడింక బాబా యాగా మూలుక్కుంటూ కమ్మరిని పిలిచి, గొడ్డలికి పదును పెట్టమన్నది. కమ్మరి పదును పెట్టి ఇచ్చాక దాంతో మళ్ళీ చెట్టును నరకటం మొదలు పెట్టింది.

ఆలోగా చెట్టు కొమ్మల్లో ఉన్న పిలిప్కా దిగులు పడటం మొదలు పెట్టాడు. 'పూర్తిగా ఆలస్యం కాకముందే తనను తాను రక్షించుకోవాలి! కానీ ఎలాగ? ఈ మంత్రగత్తె బారినుండి ఎలా తప్పించుకోవాలబ్బా', అని ఆలోచిస్తూ ఆకాశంలోకి చూశాడు పిలిప్కా. అంతలో దూరం నుండి ఓ బాతుల గుంపు ఆటువైపుగా వస్తూ కనిపించింది. వాటిని చూడగానే అతనికి ఓ మంచి ఆలోచన వచ్చింది-

ఆ బాతుల గుంపు తను ఉన్న చెట్టు దగ్గరికి రాగానే "ప్రియమైన ఓ బాతుల్లారా! మీరంతా తలా ఒక ఈకా విదిలించండి- వాటితో రెక్కలు తయారు చేసుకుంటాను- ఆపైన మీతో పాటు ఎగిరి నా తల్లిదండ్రుల దగ్గరకి వెళ్తాను. అక్కడ మీకు గింజలు తీసి ఇచ్చి, అట్లా మీ రుణం తీర్చుకుంటాను!" అన్నాడు. అది విని బాతులు తలా ఒక ఈకా విదిల్చాయి. పిలిప్కా అన్నీ కలుపుకుంటే, వాటితో ఒక పెద్ద రెక్క

తయారైంది.

ఆలోగా బాబాయాగాకు ఇంకా చాలా కోపం వచ్చింది. చెట్టును ఇంకా వేగంగా నరకటం మొదలు పెట్టింది. అయితే పిలిప్కాకి ఇంకా రెండో రెక్క కావాలి! 'ఎలాగ?' అనుకుంటుంటే అటుగా మరో బాతుల గుంపు వచ్చింది.

"ప్రియమైన బాతుల్లారా! మీరంతా తలా ఒక ఈక విదిలించండి- వాటితో ఇంకో రెక్క తయారు చేసుకుని, నా తల్లిదండ్రుల దగ్గరకి వెళతాను. అక్కడకి వెళ్ళాక మీకు గింజలు ఇచ్చి ఋణం తీర్చుకుంటాను!" అన్నాడు. అవి కూడా తలా ఒక ఈకను విదిల్చాయి. పిలిప్కా గబగబా ఇంకో రెక్కను తయారు చేసుకుని, ఆ బాతుల గుంపు సహాయంతో ఎగిరిపోయాడు.

అయితే కోపం ఎక్కువైన బాబాయాగా ఇదంతా గమనించలేదు! అటూ ఇటూ చూసుకోకుండా చెట్టు కాండాన్నే నరుకుతూ పోయింది. తను నరుకుతున్న ఆ చెట్టు ఎటు వైపు పడుతోందో కూడా చూసుకోలేదామె- చివరికి అది పోయి బాబాయాగా మీదే ధడాలున పడింది! దెబ్బకు ఆ చెట్టు క్రింద నలిగిపోయి మంత్రగత్తె కాస్తా చచ్చిపోయింది.

అటుపైన మెల్లగా బాతులని పట్టుకుని, ఎగురుకుంటూ ఇంటికి చేరుకున్నాడు పిలిప్కా. ఆ సరికి వాళ్ల అమ్మా నాన్నా ఇద్దరూ భోజనం చేస్తున్నారు. పిలిప్కా రావటం చూసి వాళ్ళు ఎంతగానో సంతోషపడ్డారు.

గబగబా బయటికి వెళ్ళి బాతులన్నిటికీ కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అన్నిటికీ గింజలు వేశారు.

అవన్నీ కూడా "క్వాక్! క్వాక్!" అంటూ సంతోషంగా గింజలని తినేసి, వీడ్కోలు చెప్పి ఎగిరిపోయాయి.

అటుపైన వాళ్లమ్మ పిలిప్కాకి చక్కని వేడివేడి భోజనం వడ్డిస్తే, అది తింటూ జరిగిన కథంతా చెప్పాడు పిలిప్కా. అది విని వాళ్ల అమ్మా వాళ్ళు ఎంత ఆశ్చర్యపడ్డారో-మీరు అక్కడుంటే తెలిసేది!



పదరంగం-80

నిర్వహణ: డా. సిరి, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం

1	★	2		3	★
4	5		★	6	7
8		★	9		
★	10	11		★	
12			★	13	
	★		★	14	

అడ్డం

2. పిల్లల్ని అతిగా ముద్దు చేయటం (3)
4. రాజులకి రాజు (3)
6. 'అందరం'లో మొదటి అక్షరం మాయమైంది (2)
8. వంద వేలు! (2)
9. పాలను తోడేయగా వచ్చేది (3)
10. వరుస తప్పిన 'సున్నము' (3)
12. వాడుక భాషలో మొదటి పదం (3)
13. తిరగబడిన 'రాత్రి' (2)
14. 'పట్టణం' వాడుక భాషలో-(2)

నిలువు:

1. చేనేతకు ప్రసిద్ధమైన స్థలం: తన పేరులో కూడా చీరను దాచుకుంటుంది! (3)
2. ఆడవాళ్లు చేతులకి ధరించేది (2)
3. ఆంధ్రప్రదేశ్‌లో, లడ్డూలకి పేరుగాంచిన రేవు పట్టణం (3)
5. రాక్షసికి పుంలింగం (4)
7. జాతరలో పిల్లలంతా ఇష్టంగా ఎక్కేది (5)
9. కర్ణాటకలో 'పెన్నార్' అని పిలువబడే నదిని మన రాష్ట్రంలో ఇలా పిలుస్తాం (2)
11. కోయిల మరో పేరు తలక్రిందులైయ్యింది (3)
12. ఏడు రోజులే ఇట్లా పిలుస్తారు? (2)
13. 'పత్రి' క్రింద నుండి పైకి (2)

అడ్డం-నిలువు ఆధారాల సహాయంతో ఈ గడులను నింపగలరేమో చూడండి. నింపిన పదరంగాన్ని, కేవలం పోస్టుకార్డుపై రాసి, మాకు అందేట్లు పంపండి. మీ బడి పేరు, తరగతి, మీవాళ్ల ఫోను నంబరు తప్పక రాయండి. సరైన సమాధానం రాసి ఎంపికైన ముగ్గురు పిల్లలకు కొత్తపల్లి - 82 ని బహుమతిగా పంపిస్తాం!

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు. పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. సాయం చేయండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం !

ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొత్తపల్లి ప్రింటు పుస్తకాల వివరాలు:

క్రమ సంఖ్య	వివరాలు	ఒక సెట్ లోని పుస్తకాల సంఖ్య	స్టాకులో ఉన్న సెట్లు (సుమారుగా)	వెల (రూ) (పోస్టేజి అదనం)
1	2011 Set	11	50	220
2	2012 Set	11	30	220
3	2013 Set	7	25	175
4	2014 Set	10	600	250
5	2015 Set	7	1400	175

వివరాలకోసం సంప్రతించండి:

కొత్తపల్లి ప్రచురణలు

1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర,

చెన్నేకొత్తపల్లి, అనంతపురము జిల్లా- 515101

Phone: 7702877670, 9000453887

Our Bank Account Details:
SB A/c : Kottapalli prachuranalu
A/c No: 62320333310
State Bank Of Hyderabad,
Dharmavaram Branch
IFSC: SBHY0020902

కొత్తపల్లి కథల పుస్తకాలను ఇంటర్నెట్లో పూర్తిగా ఉచితంగా చదవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు!

సందర్శించండి: http://kottapalli.in. మెయిలు ద్వారా సంప్రతించండి: team@kottapalli.in

RNI Regn No. : APTEL/2014/62705 Date Of Publishing: 01/12/2015 Postal Regn No: HDP/008/2015-2017

ఫ్యాట్ పౌడర్

"మా అమ్మాయితో మాకేమీ కష్టం లేదురా!" అంటూ ఇంట్లోకొచ్చాడు సుబ్బారావు.

'ఏం అలాగ?' అన్నా.

'ఏముంది, ప్రొద్దునే ఏడింటికల్లా బస్సు వచ్చేస్తుందా, బడికెళ్లిపోతుంది. మళ్లీ రాత్రి మేం ఇంటి కొచ్చి కొంచెం సర్దుకున్నాక, ఎనిమిదింటికి- ఇంటికొస్తుంది. ఓ రెండు గంటలు చదువుకొని ఇంక పడుకోవటమే!" చెప్పాడు.

"రాత్రి ఎనిమిదౌతుందా? అంతవరకూ ఏం పని?!" అన్నా.

"అట్లా అంటావేంటి? ఐఐటీ బ్యాచ్ కదా, కష్టపడాలి! ఇప్పుడంటే ఇదింకా ఎనిమిదో క్లాసే. అందుకని ఎనిమిది! పదో క్లాసు పిల్లలకైతే పది అవుతుంది!" అన్నాడు సుబ్బారావు నా కళ్లు తెరిపిస్తూ.

"మరి వంటా-తంటా..?!" నసిగా.

"ప్రొద్దున టిఫిన్ ఒక్కటీ మనం పెట్టాలి. మిగతావన్నీ వాళ్లే చూసుకుంటారు!"

"అయినా ఇంటి వంట శ్రేష్ఠం కదా, పిల్లలు- సమతుల ఆహారం- ఆరోగ్యం- అన్నీ.." అన్నాను నేను.

"మన కంటే వాళ్ల వంటే నయం. నీకో సంగతి చెప్పనా, వాళ్ల వంట తినటం మొదలెట్టాక మా పాప కొంచెం ఒళ్లు చేసింది; బుగ్గలు నునుపెక్కాయి; బరువు పెరిగింది-ఇప్పుడు ఎంత ఆరోగ్యంగా ఉందో తెలుసా, మన ఇంట్లో పెట్టేది దాని ముందు ఎందుకూ పనికిరాదు!"

"అవునా, అంత మ్యాజిక్ భోజనం ఏముంటుదబ్బా? ఓ పని చెయ్యి స్వామీ, నీకు పుణ్యం ఉంటుంది- వాళ్ల వంట రహస్యం కనుక్కొచ్చి చెప్పు- మా పాపనీ అట్లా బొద్దుగా చేస్తాం, నీ పేరు చెప్పుకొని!" అన్నా నవ్వుతూ.

"ఏం లేదు, 'ఫ్యాట్ పౌడర్' దొరుకుతుంది ఒకటి. తినే వంటలో అది కలిపితే, పిల్లలంతా ఇట్లా బలంగా అవుతారట. వాళ్ల బళ్లో వాడేది అదే- నేను ఎప్పుడో కనుక్కున్నాను!" చెప్పాడు సుబ్బారావు గర్వంగా.

"అదెక్కడా వినలేదే, ప్రోటీన్ పౌడరేమో-అయినా అది శాకాహారమా, మాంసాహారమా? మంచిదో, కాదో? మేం తినచ్చో, లేదో?" అంత గొప్ప పౌడైతే గవర్నమెంటువాళ్లూ దాన్ని వాళ్ల వంటల్లో కలపచ్చుగా?! అయినా ఆ పౌడేదో వేసి పెట్టినవాళ్ళు అసలు అన్నం, పప్పు, కూరలు అన్నీ పెడుతున్నారో, లేదో!" అన్నా అనుమానంగా.

"నీ చాదస్తం వదలవా?! అన్నీ అనుమానాలే నీకు. అందుకే ఇట్లా ఉన్నావు!" కసిరాడు సుబ్బారావు "పోయొస్తా, అమ్మాయిని కంటి డాక్టరు దగ్గరికి తీసుకెళ్లాలట- వాళ్ళ బడివాళ్లు ఉత్తరం పెట్టి పంపారు!"

"మరి అంత ఆరోగ్యంగా ఉందన్నావు గదరా, ఫ్యాట్ పౌడర్ కంటి మీద పని చెయ్యదా? " అని నవ్వేశా తేలిగ్గా.

Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu and printed at Mudrica Offset Printers, Vijayawada and published at “Kottapalli”, 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma.